మంగళవారం
23-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 32
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికా రాజకీయాలు పట్టించుకోం: రష్యా

మాస్కో: అమెరికా రాజకీయాలు ముఖ్యం కాదని, ఉక్రెయిన్ యుద్ధ లక్ష్యాలను చేరుకోవడానికే తాము ప్రాధాన్యం ఇస్తామని రష్యా స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్ష రేసు నుంచి వైదొలిగినట్లు ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ ప్రకటించిన తర్వాత... రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి పెస్కోవ్ అక్కడి మీడియాతో మాట్లాడుతూ... "అమెరికా ఎన్నికలకు ఇంకా నాలుగు నెలల సమయముంది. ఈ సుదీర్ఘ సమయంలో ఎన్నో మార్పులు జరుగుతుంటాయి. వాటి గురించి పెద్దగా ఆలోచించాల్సిన పని లేదు. ఏం జరుగుతుందో మనం ఓపికగా పరిశీలిస్తూ ఉండాలి. అయితే, రష్యా మాత్రం ఉక్రెయిన్‌పై చేస్తున్న స్పెషల్ మిలటరీ ఆపరేషన్ లక్ష్యాలను చేరుకోవడానికే ప్రాధాన్యం ఇస్తుంది" అని తెలిపారు.

సమ్మిళిత అభివృద్ధే లక్ష్యం

- గత ప్రభుత్వంలో అన్ని రంగాలకూ నష్టాలే
- 12.8 నుంచి 8.1కి దిగజారిన వార్షిక వృద్ధి రేటు
- వికేంద్రీకరణ ముసుగులో అమరావతి నాశనం
- ప్రతీకార పాలనతో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్
- అప్పులు పెరిగి, గణనీయంగా పడిపోయిన ఆదాయం
- అయినా 'సూపర్ సిక్స్' అమలుకు కట్టుబడి ఉన్నాం
- గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్ సమ్మిళిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం సందర్భంగా సోమవారం ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. విభజన చట్టంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తగినంత పరిహారం ఇవ్వలేదు. ఆస్తులు, అప్పుల పంపిణీలో అసమానతలు ఉన్నాయి. అశాస్త్రీయ విభజన వల్ల 46 శాతం వనరులు మాత్రమే వారసత్వంగా వచ్చాయి. రాజధాని హైదరాబాద్‌ను కోల్పోవడం వల్ల ఆర్థిక నష్టం జరిగింది. ఉన్నత విద్యాసంస్థలు కోల్పోయాం. భారీ రెవెన్యూ లోటు వారసత్వంగా వచ్చింది. ఈ నేపథ్యంలో 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక ఏపీ అభివృద్ధి, రాజధాని నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశారు. 2014-19 మధ్య రాష్ట్రంలో పెట్టుబడుల వరద కొనసాగింది. ఆ తర్వాత 2019-24లో అన్ని రంగాలు నష్టాలను చవిచూశాయి. ప్రతీకార రాజకీయాలతో సాగిన పాలన వల్ల అభివృద్ధి అవకాశాలు దెబ్బతిన్నాయి. 2019 జూన్‌లో బాధ్యతలు స్వీకరించిన ప్రభుత్వం ప్రారంభించిన ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన విధ్వంసకర విధానం 2024 జూన్ వరకు నిరంతరాయంగా కొనసాగింది. ఫలితంగా ఏపీ బ్రాండ్ దెబ్బతిని పెట్టుబడిదారులు వెనుతిరిగే పరిస్థితి ఏర్పడి రాష్ట్రాభివృద్ధి తిరోగమనంలో పయనించింది. అన్నిస్థాయిలో అవినీతి విధానాలతో పాటు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆదాయాన్ని ఆర్జించే శాఖల్లో పాలనా సాధనాలను ఆయుధంగా మార్చుకోవడం, చెక్స్, బ్యాలెన్స్ దెబ్బతినడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలన్నీ నిర్వీర్యమయ్యాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింది.రాష్ట్ర సమ్మిళిత వార్షిక వృద్ధిరేటు 12.8 నుంచి 8.1 శాతానికి పడిపోయింది. మరోవైపు రెవెన్యూ వ్యయం 7.8 శాతం నుంచి 10.5కి పెరగ్గా, మూలధన వ్యయం వృద్ధి దారుణంగా 26.4 నుంచి 3.4శాతానికి క్షీణించింది. గత ఐదేళ్లలో ఎటువంటి నీటిపారుదల ప్రాజెక్టులు, కొత్త పరిశ్రమలు, రోడ్లు, భవనాలు, ఆసుపత్రులు, తాగునీటికి సంబంధించిన కనీస మౌలిక సదుపాయాలను చేపట్టలేదు. ఇంధన రంగం, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో అవగాహన ఒప్పందాలను రద్దు చేయడం భారీ నష్టం వాటిల్లింది. గత ఐదేళ్ళ పాలనలో జరిగిన వ్యవస్థల వైఫల్యం, నిధుల వినియోగంలో అనేక అంతరాలు, దుర్వినియోగం ఫలితంగా రాష్ట్ర ఖజానాకు, సహజ వనరుల మూలాలకు భారీ నష్టం వాటిల్లింది. వికేంద్రీకరణ ముసుగులో మూడు రాజధానుల ఏకపక్ష ప్రకటన ఫలితంగా అమరావతి రాజధాని వృద్ధిని నాశనమై దాదాపు 7 లక్షల ఉద్యోగాలు, 2లక్షల కోట్ల సంపద నష్టం వాటిల్లింది. 2018 వరకు ఇంధన రంగంలో మిగులు రాష్ట్రంగా ఉన్న ఏపీ 2024 నాటికి రూ.1,29,503 కోట్ల నష్టం వాటిల్లింది. భూమి, గనులు, ఖనిజాలు, అడవులు వంటి సహజ వనరుల దుర్వినియోగం విస్తృతం అయింది. ఎక్సైజ్ ఆదాయ మార్గాలను కూడా గత ప్రభుత్వం అపహాస్యం పాలు చేసింది. ఎక్సైజ్‌పై వ్యాట్‌ను తగ్గించి ప్రత్యేక మార్జిన్‌గా రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌కు మళ్లించారు. నాణ్యత లేని మద్యాన్ని అధిక ధరలకు విక్రయించారు. మరోప్రక్క ఆదాయానికి మించి అప్పులు చేశారు. ఫలితంగా నూతన ప్రభుత్వానికి కనీస చెల్లింపు బాధ్యతా వ్యయాన్ని కూడా భరించడం కష్టతరంగా మారింది. జీతాలు, పెన్షన్ల భారీ బకాయిలు సుమారు రూ.10లక్షల కోట్ల రుణ భారానికి రుణం తిరిగి చెల్లింపులు, విద్యుత్ రంగ బకాయిల చెల్లింపులు, పౌర సరఫరాలు, ఇతర అప్పుల చెల్లింపులు సవాల్‌గా మారాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ పరిపాలనను

- మిగతా 2 లో

అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

నల్ల కండువాలతో వైసీపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

ప్లకార్డులు చించేసిన పోలీసులు... జగన్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసెంబ్లీ సమావేశాల తొలిరోజు ప్రారంభానికి ముందు ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతలు క్షీణించాయని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. తొలుత అసెంబ్లీ ప్రాంగణం సమీపానికి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేరుకున్నారు. అక్కడి నుంచి మెడలో నల్ల కండువాలు, ప్లకార్డులతో నిరసన ప్రదర్శనగా అసెంబ్లీ ప్రాంగణం నుంచి లోపలికి బయల్దేరారు. వారిని అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకుని ప్లకార్డులను చించివేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో పోలీసులతో జగన్ వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుకూడా పోలీసుల వ్యవహార శైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మధుసూదన్‌రావు గుర్తుపెట్టుకో: జగన్ హెచ్చరిక

మధుసూదన్‌రావు... గుర్తుపెట్టుకో, ఎల్లకాలం ఇదే మాదిరిగా

- మిగతా 2 లో

26 వరకు అసెంబ్లీ

బీఏసీ నిర్ణయం... వైసీపీ గైర్హాజరు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అసెంబ్లీ సమావేశాలు ఈనెల 26వ తేదీ వరకు ఐదు రోజులు జరగనున్నాయి. శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభయ్యాయి. ఉదయం గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం సభ వాయిదా పడింది. తర్వాత స్పీకర్ అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన శాసనసభా వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశం జరిగింది. సమావేశానికి సభానాయకుడు చంద్రబాబు, శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, జనసేన నుంచి మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ తరపున ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు హాజరయ్యారు. దీనికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గైర్హాజరయ్యారు. ఈ దఫా అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలి? ఏయే అంశాలపై చర్చించాలనేదానిపై సమావేశంలో చర్చించారు. ఈనెల 26వ తేదీ వరకు సమావేశాలు

- మిగతా 2 లో

ఆ ప్రశ్నకు సరైన సమాధానంపై నేడు నివేదిక ఇవ్వండి

'నీట్-యూజీ' పరీక్షపై ఐఐటీ-ఢిల్లీ డైరెక్టర్‌ను ఆదేశించిన సుప్రీం

న్యూఢిల్లీ : నీట్-యూజీ 2024 పరీక్షలో అడిగిన నిర్దిష్ట ప్రశ్నకు సరైన సమాధానం కోసం సంబంధిత పాఠ్యాంశానికి చెందిన ముగ్గురు నిపుణులను ఏర్పాటు చేసి, జులై 23 మంగళవారం దానిపై ఒక నివేదిక సమర్పించాలని ఐఐటీ-ఢిల్లీ డైరెక్టర్‌ను సుప్రీం కోర్టు ఆదేశించింది. నీట్-యూజీ పరీక్ష నిర్వహణలో అవకతవకలపై న్యాయస్థానం సోమవారం మరోసారి విచారణ జరిపింది. 'అణువు', దాని లక్షణాలకు సంబంధించిన ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉన్నాయని, రెండు సరైన సమాధానాలలో ఒక నిర్దిష్ట సమాధానాన్ని ఇచ్చిన పరీక్షార్థులకు నాలుగు మార్కులు ఇచ్చారని కొంతమంది ఆశావహులు సమర్పించిన అభ్యర్థనలను ఉన్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఇది అర్హత సాధించిన అభ్యర్థుల తుది మెరిట్ జాబితాపై గణనీయమైన ప్రభావం

- మిగతా 2 లో

భూ రికార్డులు దగ్ధం

- మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అర్ధరాత్రి ఘటన
- కావాలనే తగులబెట్టారని అనుమానాలు
- విచారణ చేసి తేలుస్తామన్న డీజీపీ

భూ కబ్జాదారులను రక్షించేందుకే
నారాయణ
2లో

విశాలాంధ్ర -మదనపల్లె: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఐదేళ్ల క్రితం నిర్మించిన భవనంలో అగ్ని ప్రమాదం సంభవించడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. భూములకు సంబంధించి సెక్షన్ 22ఎ విభాగం, కంప్యూటర్ సెక్షన్‌లో పూర్తిగా ఫైళ్లు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి మంటలు వ్యాపించడంతో నైట్‌వాచ్‌మన్‌గా విధుల్లో ఉన్న నిమ్మనపల్లె మండలం అగ్రహారానికి చెందిన వీఆర్ఏ రమణ మంటలను గమనించి నిమ్మనపల్లె డిప్యూటీ తహసీల్దార్ తపస్వినికి సమాచారం అందించారు. వెనువెంటనే ఆమె మదనపల్లె ఆర్డీఓ సీసీ మణికి సమాచారం ఇవ్వడంతో ఆయన ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి శివప్ప సిబ్బందితో సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ఎగిసి పడుతున్న మంటలను ఆర్పివేశారు. అప్పటికే భవనంలోని చాలా రికార్డులు, డాక్యుమెంట్లు, కంప్యూటర్లు,

- మిగతా 2 లో

పరీక్ష వ్యవస్థ విధ్వంసం

కేంద్రంపై రాహుల్ ధ్వజం

ప్రశ్నపత్రాల లీకేజీలపై ఆధారాల్లేవన్న మంత్రి ధర్మేంద్ర

లోక్‌సభ నుంచి ప్రతిపక్ష సభ్యుల వాకౌట్

న్యూఢిల్లీ : దేశంలోని పరీక్షా విధానంలో చాలా తీవ్రమైన సమస్య ఉందని, విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దీనికి తాను తప్ప అందరినీ నిందిస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం విమర్శించారు. సోమవారం లోక్‌సభలో ప్రశ్నాపత్రం లీక్ అంశంపై ప్రభుత్వంపై ప్రతిపక్ష దాడికి ఆయన నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రధాన్ మాట్లాడుతూ 'నా నాయకుడు, ప్రధానమంత్రి దయతో ఇక్కడ ఉన్నాను' అని అన్నారు. తన ప్రభుత్వం సమష్టిగా జవాబుదారీగా ఉందని చెప్పారు. గత ఏడేళ్లలో ప్రశ్నా పత్రాల లీకేజీకి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని మంత్రి స్పష్టం చేశారు. ప్రశ్నా పత్రాల లీకేజీపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా, అన్ని పరీక్షల గురించి ప్రశ్నలు లేవనెత్తడం సరికాదని, మెరుగైన పరీక్షా విధానాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని సభ్యులు చర్చించాలని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్‌లో జరిగిన అవకతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ జరుపుతోంది. ఆరు ఎఫ్ఐఆర్‌లు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కన్వర్ యాత్రలో పేర్ల ప్రదర్శనపై స్టే

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం: సుప్రీం

న్యూఢిల్లీ: కన్వర్ యాత్ర(కావడి యాత్ర) మార్గంలోని తినుబండారాల యజమానులు బయట తమ పేర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం మధ్యంతర స్టే విధించింది. షాపు యజమానులు తమ షాపుల ముందు తమ పేరు లేదా గుర్తింపు చూపించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. తయారు చేస్తున్న ఆహారాన్ని మాత్రమే ప్రదర్శించాలని దుకాణదారులను ఆదేశించింది. ప్రభుత్వాల ఆదేశాలు రాజ్యాంగ స్ఫూర్తికి

- మిగతా 2 లో

వృద్ధిరేటు పటిష్టం

6.5 నుంచి 7 శాతం... ఆర్థిక సర్వే అంచనా

నేడు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలమ్మ

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో 6.5 నుంచి 7 శాతం వృద్ధి రేటు నమోదు చేసే అవకాశం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు కొనసాగినా దేశీయ వృద్ధి చోదకాలు ఆర్థికానికి అండగా నిలిచాయని పేర్కొంది. దేశంలో ఆర్థిక వ్యవస్థ భవిష్యత్‌లో వృద్ధిలో ముందుకు దూసుకెళ్లనుంది తెలిపింది. అంతర్జాతీయ భౌగోళిక పరిణామాలు, వాటి ప్రభావం ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చని, ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. కేంద్రమంత్రి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్థిక సర్వే ప్రవేశపెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం బడ్జెట్ సమర్పించనున్న వేళ సోమవారం ఆర్థిక సర్వేను సభ ముందుంచారు. దీంతో పాటు గణాంక అనుబంధాన్ని కూడా సభ ముందుంచారు. బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత ఏడాది కాలంలో దేశ ఆర్థిక పనితీరును, రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఆర్థిక సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనమిక్ డివిజన్ ఈ సర్వే రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం

- మిగతా 2 లో

నితీశ్‌కు మోదీ సర్కార్ ఝలక్

బీహార్‌కు ప్రత్యేకహోదా సాధ్యం కాదని వెల్లడి

8లో

ఆర్థిక సర్వే వాస్తవ విరుద్ధం

- 'వికసిత్ భారత్' కార్పొరేట్ల కోసమేనా?
- సీపీఐ జాతీయ సమితి విమర్శ
- యోగి సర్కారు వివక్షాపూరిత ఉత్తర్వుల నిలిపివేతపై హర్షం

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ సర్కారు లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2023-24 ఆర్థికసర్వే.. దేశంలో వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉందని, ప్రభుత్వం కేవలం కార్పొరేట్లకు సేవలందిస్తున్నట్లుగా ఉందని భారత

- మిగతా 2 లో

బైడెన్ స్థానంలో ఎవరు?

వాషింగ్టన్: డెమొక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిగా వైదొలుగుతున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ ప్రకటించడం వల్ల ఆ స్థానాన్ని దక్కించుకునేదెవరనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. సొంత డెమోక్రాట్ పార్టీ నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో పార్టీ, దేశ ప్రయోజనాల దృష్ట్యా తాను పోటీ నుంచి వైదొలగుతున్నట్లు ఆదివారం బైడెన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉపాధ్యక్ష రేసులో ఉన్న కమలా హ్యారిస్‌కే అధ్యక్ష అభ్యర్థిగా మద్దతిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అయితే కమలా హ్యారిస్ సొంతపార్టీలోనే గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. మరి కొందరు కీలక నేతలు కూడా డెమొక్రటిక్ అభ్యర్థిత్వాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రేసులో ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ముందున్నారు. ఇప్పటికై బైడెన్ కూడా హ్యారిస్‌కు మద్దతు ప్రకటించారు. అయితే డెమొక్రటిక్ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్న వారిలో కమలా హ్యారిస్(59) కాలిఫోర్నియాలోని ఓక్లాండ్‌లో జన్మించారు. అమెరికా తొలి మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎంపికై చరిత్ర సృష్టించారు. కమలా హ్యారిస్ తర్వాత జేబీ ప్రిట్జ్‌కర్ ప్రస్తుతం ఇల్లినాయీ గవర్నర్‌గా ఉన్నారు. అమెరికాలో అత్యంత ధనిక రాజకీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రిట్జ్‌కర్ నికర ఆస్తుల విలువ 3.4 బిలియన్ డాలర్లు. అమెరికా రాజ్యాంగ సవరణలకు మద్దతు ఇచ్చారు. "థింక్ బిగ్ అమెరికా" అనే నినాదంతో ప్రజల మద్దతు పెంచుకున్నారు. మరొకరు మిషిగన్ గవర్నర్ గ్రెచెన్ విట్మెర్... శాసనసభలో ఒకటిన్నర దశాబ్దంపాటు పనిచేశారు. డెమొక్రటిక్ పార్టీలో వేగంగా ఎదిగిన మహిళా నేతగా గుర్తింపు పొందారు. డెమొక్రటిక్ పార్టీలో అత్యంత ప్రభావవంతమైన స్పీకర్‌గా ఉన్నారు. అబార్షన్ హక్కులపై గళం విప్పి మహిళలను ఆకట్టుకున్నారు. అధ్యక్ష అభ్యర్థిత్వానికి బలమైన పోటీదారుగా ఉన్నారు. జాతీయ రాజకీయ కార్యాచరణ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. మరొక నేత గావిన్ న్యూసమ్... గావిన్ న్యూసమ్ కాలిఫోర్నియా గవర్నర్‌గా ఉన్నారు. 1995లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2004లో స్వలింగ జంటలకు వివాహ లైసెన్సును జారీ చేసి అందరి దృష్టి ఆకర్షించారు. బైడెన్‌కు బలమైన

కమలా హ్యారిస్‌కు సొంతపార్టీలోనే గట్టిపోటీ

నమ్మకస్థుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. గావిన్‌కు కాలిఫోర్నియా అంతటా రెస్టారెంట్లు, రిసార్ట్‌లు ఉన్నాయి. జోష్ షాపిరో... జోష్ షాపిరో పెన్సిల్వేనియా గవర్నర్‌గా ఉన్నారు. పెన్సిల్వేనియాలో ఎదుగుతున్న రాజకీయ స్టార్‌గా ఆయనను చూస్తారు. ట్రంప్ మద్దతు ఇచ్చిన అభ్యర్థిని ఓడించి గవర్నర్‌గా రెండోసారి అధికారం చేపట్టారు. రెండుసార్లు అటార్నీ జనరల్‌గా, ఒకసారి గవర్నర్‌గా చేశారు. హమాస్‌పై పోరులో ఇజ్రాయిల్‌కు సంఘీభావం ప్రకటించారు. రాయ్ కూపర్... ఉత్తర కరొలినా డెమొక్రటిక్ గవర్నర్‌గా ఉన్నారు. ఆరు సాధారణ ఎన్నికల్లో విజయం కేతనం ఎగరేశారు. పరిపాలన, చట్టసభలపై మంచి అవగాహన ఉంది. ప్రభుత్వ విద్య, అబార్షన్ హక్కుల కోసం పోరాడారు. న్యాయ విద్యను అభ్యసించారు. ఆండీ బెషీర్... బెషీర్ కెంటకీ గవర్నర్‌గా ఉన్నారు. ట్రంప్ ఆమోదించిన రిపబ్లికన్ అభ్యర్థిని ఓడించి స్టార్‌గా గుర్తింపు పొందారు. గత ఏడాది రెండోసారి కూడా ఎన్నికల్లో గెలుపొందారు . అబార్షన్ హక్కులకు మద్దతు ఇచ్చారు. కెంటకీలో అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడారు. బెషీర్ 2015లో అటార్నీ జనరల్‌గా ఎన్నికయ్యారు. మార్క్ కెల్లీ... అరిజోనాకు చెందిన సెనెటర్. వ్యోమగామిగా పనిచేసి దేశం దృష్టిని ఆకర్షించారు. కెల్లీ గత ఎన్నికల్లో ఇతర డెమొక్రాట్ల కంటే ఎక్కువ ఓట్లను సంపాదించారు. రాజకీయ హింసకు కెల్లీ కుటుంబం బలైపోయింది. గన్ నియంత్రణకు కెల్లీ పోరాటం చేస్తున్నారు. నాసాలో చేరడానికి ముందు గల్ఫ్ యుద్ధంలో పాల్గొన్నారు. స్పేస్ షటిల్‌లో మూడు మిషన్లకు నేతృత్వం వహించారు.

కమలా హ్యారిస్ అయితే... నా విజయం మరింత సులభం: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా చరిత్రలో అత్యంత చెత్త అధ్యక్షుడు జో బైడెన్ అని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డెమొక్రటిక్ అభ్యర్థిగా బైడెన్ వైదొలిగిన అనంతరం ఆయన స్పందిస్తూ... కమలా హారిస్ అధ్యక్ష అభ్యర్థి అయితే తాను మరింత సులభంగా ఆమెను ఓడిస్తానని ధీమా వ్యక్తం చేశారు. "అధ్యక్ష పదవికి పోటీ చేయడానికి జో బైడెన్ తగిన వ్యక్తి కాదు. ఆ హోదాలో పనిచేసే అర్హత అతడికి ఏనాడూ లేదు. బైడెన్ కేవలం అబద్ధాలు, తప్పుడు సమాచార వ్యాప్తి ద్వారా అధ్యక్ష పదవిని పొందారు. మీడియా, వైద్యులు సహా చుట్టూ ఉన్న అందరికీ ఆయన అధ్యక్ష హోదాలో ఉండడానికి అర్హుడు కాదని స్పష్టంగా తెలుసు.

ఆయన పాలన వల్ల మనం భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కోబోతున్నాం. కానీ వాటిని వీలైనంత త్వరగా మనం చక్కబెడదాం" అని ట్రంప్ అన్నారు. బైడెన్ స్వయంగా కమలా హ్యారిస్‌కు మద్దతు తెలిపిన క్రమంలో ట్రంప్ ఆమెపై కూడా సునిశిత విమర్శలు చేశారు. బైడెన్ కంటే కమలా హ్యారిస్‌ను ఓడించడం ఇంకా సులభమని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ కూడా కమలా హ్యారిస్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బైడెన్ కంటే కూడా ఆమె మరింత బలహీనమైన అభ్యర్థి అని విమర్శించారు.

ఆమెకు అప్పగించిన సరిహద్దు సమస్యకు ఏమాత్రం పరిష్కారం చేయలేకపోయారని విమర్శించారు.

నేడు నివేదిక ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

చూపుతుందని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు పిటిషనర్లు వాదించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... సదరు ప్రశ్నను ప్రస్తావిస్తూ, 'ప్రశ్నలో సూచించినట్లుగా విద్యార్థులు తమ సమాధానంగా ఒక ఎంపికను ఎంచుకోవలసి ఉంటుంది. సరైన సమాధానానికి సంబంధించి సమస్యను పరిష్కరించడానికి ఐఐటీ-దిల్లీ నిపుణుల అభిప్రాయాన్ని కోరాలని మేము భావిస్తున్నాం' అని తెలిపింది. 'సంబంధిత పాఠ్యాంశానికి సంబంధించి ముగ్గురు నిపుణులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా దిల్లీ ఐఐటీ డైరెక్టర్‌ను మేము అభ్యర్థిస్తున్నాం. డైరెక్టర్ ఏర్పాటు చేసిన నిపుణుల బృందం సరైన ఎంపికపై అభిప్రాయాన్ని రూపొందించి మంగళవారం మధ్యాహ్నం 12 గంటలలోపు రిజిస్ట్రార్‌కు తెలియజేయవలసిందిగా కోరుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. ఈ ఉత్తర్వులను ఐఐటీ-దిల్లీ డైరెక్టర్‌కు తెలియజేయాల్సిందిగా సుప్రీం కోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను కోరింది. వివాదాస్పద వైద్య విద్య ప్రవేశ పరీక్షకు సంబంధించిన పిటిషన్లపై ధర్మాసనం మంగళవారం విచారణను ప్రారంభించనుంది. అంతకుముందు ఇదే అంశంపై వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం... మే 4కు ముందే ప్రశ్నా పత్రం లీక్ అయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసింది. బీహార్ పోలీసుల దర్యాప్తు నివేదికను ప్రస్తావిస్తూ... స్ట్రాంగ్ రూమ్ నుంచే ప్రశ్నా పత్రం బయటకు వచ్చిందా? అని ప్రశ్నించింది. న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం నీట్-యూజీ 2024ను రద్దు చేయాలని కోరుతున్న పిటిషనర్లను పరీక్షను నిర్వహించడంలో 'వ్యవస్థాగత వైఫల్యం' ఉందన్న విషయాన్ని చూపించాలని కోరింది. ప్రశ్నా పత్రం లీక్ 'విస్తృతంగా', దేశవ్యాప్తంగా ఉందని నిర్ధారించడానికి వివరాలు అందించమని వారిని కోరింది. ప్రశ్నా పత్రం లీక్ విస్తృతంగా జరిగినట్లు చూపించడానికి ఇప్పటివరకు రికార్డులో ఎటువంటి మెటీరియల్ లేదని గమనించిన ధర్మాసనం... పాట్నా, హజారీబాగ్‌లో కొన్ని తప్పులు జరిగిన సందర్భాలు ఉన్నాయని, అయితే అవి వ్యవస్థాగత వైఫల్యాన్ని సూచించడానికి సరిపోవని పేర్కొంది. హర్యానాలోని ఝజ్జర్‌లోని పరీక్షా కేంద్రాల్లో కొంతమంది విద్యార్థులకు అదనపు మార్కులు, అదనపు సమయం మంజూరు చేయడాన్ని కూడా అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఇది విస్తృతంగా ఉందని చెప్పడానికి వివరాలు తమకు చూపాలని కోరింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అందుబాటులోకి తెచ్చిన వివరాల సహాయంతో హజారీబాగ్, పాట్నాకు మించి లీక్ అయినట్లు నిర్ధారించాలని కొందరు అభ్యర్థుల తరపు సీనియర్ న్యాయవాది నరేందర్ హుడాను కోరింది. 'ఇది ఎంత విస్తృతంగా ఉందో మాకు చూపించండి. సీబీఐ మూడవ నివేదిక నుంచి ప్రింటింగ్ ప్రెస్ ఎక్కడ ఉందో మాకు తెలుసు. మేము ఇక్కడ ఆ ప్రాంతం ఎక్కడో చెప్పదలచుకోలేదు' అని సీజేఐ అన్నారు. 'తప్పు' ప్రశ్నా పత్రాలు పంపిణీ చేసిన ఝజ్జర్, ఇతర ప్రదేశాలలో నిర్దిష్ట వర్గం విద్యార్థులకు అదనపు మార్కులు, సమయం మంజూరు చేయడంపై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఎన్‌టీఏను కోరింది. కేంద్రం, ఎన్‌టీఏ తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, 'వ్యవస్థాగత వైఫల్యం' అనే వాదనలను తోసిపుచ్చారు. పరీక్ష ప్రక్రియ మొత్తం దేశంలో దెబ్బతిన్నదని సూచించడం తప్పు అని అన్నారు. 'కొన్ని తప్పులకు కొన్ని ఉదాహరణలు ఇవ్వడం అతనికి (పిటిషనర్ల తరపు న్యాయవాది) సహాయం చేయకపోవచ్చు' అని న్యాయాధికారి అన్నారు. అనేక వ్యాజ్యాలను నివారించడానికి పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై వివిధ హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సుప్రీం కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ఎన్‌టీఏ దాఖలు చేసిన వాటితో సహా 40కి పైగా పిటిషన్లను ధర్మాసనం విచారిస్తోంది. మే 5న 14 విదేశాలతో సహా 571 నగరాల్లోని 4,750 కేంద్రాల్లో 23.33 లక్షల మంది విద్యార్థులు నీట్-యూజీ 2024 పరీక్షకు హాజరయ్యారు.

పరీక్ష వ్యవస్థ విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

నమోదు చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్, ఇతర సంబంధిత కోర్సులలో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ద్వారా నీట్-యూజీ నిర్వహిస్తారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ నీట్‌లోనే కాకుండా అన్ని ప్రధాన పరీక్షల విధానంలో చాలా తీవ్రమైన సమస్య ఉందని దేశం మొత్తానికి స్పష్టంగా అర్థమైందని అన్నారు. 'మంత్రి తనను తప్ప అందరినీ నిందించారు. ఇక్కడ జరుగుతున్న దానిలోని ప్రాథమిక అంశాలు అతనికి అర్థం కాలేదని కూడా నేను అనుకోను. సమస్య ఏమిటంటే ఈ దేశంలో లక్షలాది మంది విద్యార్థులు ఏమి జరుగుతుందనే దాని గురించి ఆందోళన చెందుతున్నారు. భారతీయ పరీక్షా విధానం ఒక మోసం అని నమ్ముతున్నారు' అని ఆయన విమర్శించారు. 'మీరు ధనవంతులు, డబ్బు ఉంటే, మీరు భారతీయ పరీక్షా విధానాన్ని కొనుగోలు చేయవచ్చు' అని గాంధీ ఆరోపించారు. 'ఇది వ్యవస్థాగత సమస్య అయినందున, వ్యవస్థాగత స్థాయిలో ఈ సమస్యను పరిష్కరించడానికి మీరు సరిగ్గా ఏమి చేస్తున్నారు?' అని ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నలకు సమాధానమిచ్చిన ప్రధాన్‌ను ఆయన ప్రశ్నించారు. సభ్యుడు పరీక్షా విధానాన్ని చెత్తగా అభివర్ణించడం దురదృష్టకరమని అన్నారు. ఏడేళ్లలో 70 ప్రశ్నా పత్రాల లీకేజీలు జరిగాయని కాంగ్రెస్ సభ్యుడు మాణికం ఠాగూర్ పేర్కొనడంపై ప్రధాన్ స్పందిస్తూ, 'గత ఏడేళ్లలో పేపర్ లీకేజీలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవు' అని అన్నారు. ఎన్‌టీఏ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు 240కి పైగా పరీక్షలు నిర్వహించామని, ఐదు కోట్ల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, 4.5 కోట్ల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని మంత్రి తెలిపారు. ప్రశ్నా పత్రాల లీకేజీ సమస్యను పరిష్కరించడానికి తీసుకున్న చర్యల గురించి ఠాగూర్ తెలుసుకోవాలనుకుంటున్నానని, మంత్రి పదవికి రాజీనామా చేస్తారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రధాన్ స్పందిస్తూ, 'నేను నా నాయకుడు, ప్రధానమంత్రి దయతో ఇక్కడ ఉన్నాను. జవాబుదారీతనం వచ్చినప్పుడల్లా నా ప్రభుత్వం దానికి సమష్టిగా జవాబుదారీగా ఉంటుంది' అని తెలిపారు. ఆరోపించిన క్రమరాహిత్యాలు, అక్రమాలకు సంబంధించి 'మేము ఏమీ దాచడం లేదు... ప్రతిదీ రికార్డులో ఉంది' అని ప్రధాన్ నొక్కి చెప్పారు. ఈ అంశంపై నిర్మాణాత్మక చర్చలు జరగాలని స్పీకర్ ఉద్ఘాటించారు. దేశంలోని అన్ని పరీక్షల గురించి ప్రశ్నలు తలెత్తితే, అది భారతీయ విద్యా వ్యవస్థపై, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవగాహనపై ప్రభావం చూపుతుందని ఆయన తెలిపారు. ప్రశ్నా పత్రం లీకేజీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరుపుతుండగా, సుప్రీం కోర్టు కూడా ఈ అంశాన్ని పరిశీలిస్తోందన్నారు. 'మెరుగైన వ్యవస్థను అభివృద్ధి చేసేలా చూడాలి... అన్ని పరీక్షలపై ప్రశ్నలు వేయడం సరికాదు' అని అన్నారు. స్పీకర్ తన వ్యాఖ్యలను ముగించిన తర్వాత, గాంధీ మాట్లాడాలనుకున్నారు కానీ అనుమతించలేదు. రాహుల్ గాంధీతో పాటు దాదాపు మొత్తం ప్రతిపక్ష సభ్యులు, టీఎంసీ, డీఎంకే సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. సభలో కాంగ్రెస్ ఉప నేత గౌరవ్ గొగోయ్... విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ కూడా ప్రశ్నా పత్రాల లీక్‌లపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ అంశంపై ప్రభుత్వం రికార్డు సృష్టిస్తుందని అన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు బాగా రాణించిన కేంద్రాల జాబితాను ఎన్‌టీఏ ప్రచురించాలని, ప్రత్యేక కేంద్రాల విద్యార్థులు ఇతరుల కంటే మెరుగ్గా రాణించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ప్రతిభావంతులైన అభ్యర్థులుగా నిలిచారని ప్రధాన్ అన్నారు. 'కేరళకు చెందిన విద్యార్థులు కూడా బాగా రాణించారు. అక్కడ కూడా తప్పు జరిగిందని మనం ఇప్పుడు చెప్పాలా?' అని విద్యాశాఖ మంత్రి ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంపీ హిబీ ఈడెన్ మాట్లాడుతూ నీట్ అంశాన్ని 'అతిపెద్ద కుంభకోణం' గా అభివర్ణించారు. 'ఎన్‌టీఏ అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీక్‌ల గురించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంది. ముఖ్యంగా హర్యానాలోని ఒకే పరీక్షా కేంద్రం నుంచి ఆరుగురితో సహా 67 మంది టాప్-ర్యాంకింగ్ అభ్యర్థులు 99.99 పర్సంటైల్ సాధించారు. ఈ కేంద్రాలను ఎవరు కలిగి ఉన్నారు?' అని ఎర్నాకులం ఎంపీ ప్రశ్నించారు. 'గుజరాత్‌లో ఈ పాఠశాలలను నిర్వహిస్తున్న సంస్థపై గుజరాత్ హైకోర్టు రూ.35 లక్షల జరిమానా విధించినప్పటికీ, గోద్రాలోని పాఠశాలను పరీక్షా కేంద్రంగా ఎన్‌టీఏ ఎంపిక చేసింది. ఈ పరీక్షలకు ఎలాంటి విశ్వసనీయత ఉంది? గుజరాత్ పాఠశాలలు, హర్యానా పాఠశాలలు అన్నీ పరిశీలనలో ఉన్నాయి' అని అన్నారు. నీట్‌పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణ జరిపించాలని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ ఎంపీ ఎన్.కె.ప్రేమచంద్రన్ డిమాండ్ చేశారు. 'మొత్తం పోటీ పరీక్షా విధానం విశ్వసనీయత కోల్పోయింది. మేము జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తున్నాం' అని ఆయన అన్నారు. జులై 19న మరణించిన వియత్నాం అధికార కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి న్గుయెన్ ఫు ట్రోంగ్‌కు కూడా సభ నివాళులర్పించింది. మరణించిన ఆయన ఆత్మకు నివాళులర్పిస్తూ సభ్యులు కూడా కొద్దిసేపు మౌనం పాటించారు.

ఆర్థిక సర్వే వాస్తవ విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) విమర్శించింది. అలాగే కావడి యాత్రలు కొనసాగే మార్గం వెంబడి దుకాణ యజమానులు వ్యక్తిగత వివరాలతో బోర్డులు పెట్టాలంటూ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను నిలిపివేస్తూ సుప్రీం కోర్టు 'స్టే' ఇవ్వడాన్ని స్వాగతించింది. ఈ మేరకు సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా సోమవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఆర్థిక సర్వే మోదీ సర్కారు వాస్తవానికి దూరంగా ఉన్నట్లు మరోమారు నిరూపితమైంది. ఆర్థికసర్వే అంచనాలు క్షేత్రస్థాయి పరిస్థితులకు ఏమాత్రం అనుగుణంగా లేవని సీపీఐ విమర్శించింది. ఉపాధి కల్పన, పెరుగుతున్న ధరలు, పెరుగుతున్న విదేశీ అప్పులు, రూపాయి విలువ పతనం వంటి ముఖ్యమైన అంశాలకు సంబంధించి మోదీ సర్కారు వాదనలకు విరుద్ధంగా వాస్తవాలున్నాయి. ఈ ఆర్థిక సర్వే ఉద్యోగాల కల్పన బాధ్యతను ప్రయివేటు రంగంపై ఉంచింది. అంటే దీని అర్థం భవిష్యత్తులో ప్రైవేటీకరణ మరింత ఉధృతం కానుంది. నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ పాలనలో కార్పొరేట్ రంగం లాభాల్లో దూసుకుపోతోందన్న ఆర్థిక సర్వే... ఉపాధి కల్పన, సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణపై మౌనంగా ఉంది. పెరిగిన ఆహార ద్రవ్యోల్బణం దేశంలోని పేద ప్రజల జేబుకు చిల్లులు పెడుతోంది. కార్పొరేట్ లాభాలు నాలుగు రెట్లు పెరగడం ప్రభుత్వ ప్రాధాన్యతలను ఎత్తి చూపుతోంది. బీజేపీ ప్రభుత్వ 'వికసిత్ భారత్' ఆలోచన కేవలం కార్పొరేట్ల కోసమేనని ఆర్థిక సర్వే స్పష్టం చేస్తోందని సీపీఐ విమర్శించింది.

వివక్షపూరిత ఉత్తర్వులపై సుప్రీం తీర్పు హర్షణీయం

కావడి యాత్రలు కొనసాగే మార్గం వెంబడి ఉన్న హోటళ్లు, ధాబాలు, తోపుడుబండ్ల ముందు వాటి యజమానులు, ఉద్యోగుల వ్యక్తిగత వివరాలతో బోర్డులు పెట్టాలంటూ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను నిలిపివేస్తూ సుప్రీం కోర్టు తాత్కాలిక 'స్టే' ఉత్తర్వులివ్వడాన్ని సీపీఐ స్వాగతించింది. అందరికీ సమానత్వంతో కూడిన సమాజాన్ని మన రాజ్యాంగం కల్పించిందని పేర్కొంది. మైనారిటీలను విదేశీయులుగా, దళితులను వర్ణ వ్యవస్థలో అట్టడుగున, స్త్రీలను పితృస్వామ్యానికి సంబంధించిన వ్యక్తులుగా పరిగణించే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం రాజ్యాంగ దృష్టికి వ్యతిరేకమని చెబుతూ... దేశంలోని అనేక బీజేపీ పాలిత రాష్ట్రప్రభుత్వాలు రాజ్యాంగాన్ని కాపాడే బదులు ఈ భావజాలాన్ని మరింత ముందుకు తీసుకువెళుతున్నాయని దుయ్యబట్టింది. సీపీఐ ఇంతకుముందు చెప్పినట్లుగానే ఈ ఉత్తర్వులు ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి అనుగుణంగా మైనారిటీలు, దళితులను వేరు చేయడానికి, మినహాయించే ప్రయత్నం. ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ రాజ్యాంగానికి కట్టుబడి తమ మతతత్వాన్ని, మనువాదాన్ని విడనాడాలి. విభజనకు ఆజ్యం పోసే ప్రయత్నాలను ప్రజలు ఓడిస్తారన్న సంగతి గుర్తెరగాలని సీపీఐ పేర్కొంది.

భూ రికార్డులు దగ్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న డీఎస్పీ ప్రసాద్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద విషయాన్ని ఎస్పీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఉదయాన్నే కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, సీఐడీ, విజిలెన్స్ బృందాలు విచారణ మొదలు పెట్టాయి. కార్యాలయంలోని సీసీ కెమెరా ఫుటేజి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అయినప్పటికీ రాత్రి 10:30 గంటల వరకు విధుల్లో ఉన్న జూనియర్ అసిస్టెంట్ (కంప్యూటర్ ఆపరేటర్) గౌతమ్ తేజను పోలీసులు అదుపులోకి తీసుకుని ఏం జరిగిందనే దానిపై ప్రశ్నిస్తున్నారు. జిల్లాస్థాయి దర్యాప్తు అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తుండగానే సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ అధిపతి రవిశంకర్ సాయంత్రానికి సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని సమగ్ర విచారణ చేపట్టారు. కాగా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడున్న ఆర్డీఓను బదిలీ చేసి ఐఏఎస్ అధికారి మేఘ స్వరూప్‌ను మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చింది. మేఘ స్వరూప్ సోమవారం బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్ని ప్రమాదానికి గురి కావడం అనుమానాలకు తావిస్తోంది.

అగ్ని ప్రమాదంపై అనుమానాలు: డీజీపీ

డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ అధిపతి రవిశంకర్, కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ మూడు గంటల పాటు పరిశీలించిన తర్వాత అది యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్‌గా భావిస్తున్నామన్నారు. 22ఏ భూముల రికార్డులున్న గదిలో ఫైర్ ఇన్సిడెంట్ జరిగింది. కీలక దస్త్రాలున్న విభాగంలో ఈ ఘటన చోటుచేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఘటన సమాచారం ఆర్డీవోకు తెలిసింది కానీ, కలెక్టర్‌కు సమాచారం ఇవ్వలేదు. ఘటన విషయం తెలుసుకున్న సీఐ కూడా ఎస్పీ, డీఎస్పీలకు సమాచారం ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారుల అలసత్వం కనిపిస్తోంది. కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ జరిగేందుకు అవకాశమే లేదని విచారణలో తేలింది. ఇక్కడ వోల్టేజ్ తేడాలు లేవని అధికారులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఫోరెన్సిక్ వాళ్లు కూడా చెప్పారు. ఆర్డీవో కార్యాలయ ఉద్యోగులు ఆదివారం రాత్రి ఎందుకు పని చేస్తున్నారు? అగ్ని ప్రమాదం జరిగిన చోట అగ్గిపుల్లలు దొరకడం వంటి విషయాలు అనేక అనుమానాలకు దారితీస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై చాలా సీరియస్ గా ఉందని, దోషులు ఎంతటి వారైనా పట్టుకుని శిక్షిస్తామని తెలిపారు.

రన్నింగ్ ఫైల్స్ కాలిపోయాయి: కలెక్టర్

కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ... సబ్ కలెక్టర్ కార్యాలయంలో రన్నింగ్ ఫైల్స్ దగ్ధమైనట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 25 అంశాలకు సంబంధించిన దస్త్రాలు దగ్ధమయ్యాయన్నారు. ఈ 25 అంశాల్లో చుక్కల భూములు, నిషేధిత భూములు ఉన్నట్లు తెలిపారు. కాలిపోయిన ఫైళ్లు ఏంటో గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, షార్ట్ సర్క్యూట్ కానప్పుడు ఘటన ఎలా జరిగిందనేది తేలాల్సి ఉందని చెప్పారు. ఈ పరిశీలనలో జిల్లా ఏఎస్పీ రాజ్ కమల్, డీఆర్‌ఓ సత్యనారాయణరావు, మదనపల్లి ఆర్డిఓ హరిప్రసాద్, రాయచోటి ఆర్డీవో రంగస్వామి, రాజంపేట ఆర్డిఓ మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధిరేటు పటిష్టం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్‌తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బడ్జెట్‌కు ఒక రోజు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. కార్పొరేట్, బ్యాంకింగ్ బ్యాలెన్స్ షీట్స్ బలంగా ఉన్నాయని, ప్రైవేటు పెట్టుబడుల వృద్ధికి ఇది దోహదం చేస్తుందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. భారత వృద్ధిలో క్యాపిటల్ మార్కెట్‌లది కీలకపాత్ర అని, భౌగోళిక రాజకీయ, ఆర్థిక పరిణామాలను తట్టుకోలదని ఆర్థిక సర్వే తెలిపింది. పెరిగిన చైనా ఎఫ్‌డీఐలు ప్రపంచంలో భారత సరిఫరా చైన్‌లో భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు ఎగుమతులకు ఊతమివ్వడానికి సహాయపడుతుందని, దేశంలో నిరుద్యోగిత తగ్గుముఖం పట్టిందని చెప్పుకొచ్చింది. 2022-23 నాటికి నిరుద్యోగిత రేటు 3.2 శాతానికి తగ్గిందని, ఆటోమొబైల్ రంగంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం వల్ల రూ.67,690 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, ఇందులో రూ.14వేల కోట్లు కార్యరూపం దాల్చాయని వివరించింది. భారత ఆర్థిక వ్యవస్థ కోవిడ్ అనంతరం పుంజుకునేందుకు విధాన రూపకర్తలు చేసిన ప్రయత్నం ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ధారిస్తుందని ఈ సర్వే పేర్కొంది. ప్రపంచ అస్థిరతల నడుమ 'అధిక వృద్ధి ఆకాంక్షలు కలిగిన దేశానికి 'మార్పు' మాత్రమే స్థిరంగా ఉంటుందని' ఈ సర్వే చెప్పింది. వాణిజ్యం, పెట్టుబడులు, వాతావరణం వంటి కీలకమైన ప్రపంచ సమస్యలపై ఒప్పందాలు చేసుకోవడం కష్టంగా మారింది. 2022 నుంచి ప్రయివేటు రంగం పెట్టుబడులు పెడుతున్నప్పటి నుంచి కొన్నేళ్లుగా ప్రభుత్వ పెట్టుబడులు మూలధనాన్ని కొనసాగించాయని ఈ సర్వే స్పష్టం చేసింది. కొన్ని నిర్దిష్ట ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం రేటు పెరిగినప్పటికీ, ప్రధాన ద్రవ్యోల్బణం రేటు చాలావరకు నియంత్రణలో ఉంది. 2023 కంటే 2024లో వాణిజ్యలోటు తక్కువగా ఉంది. జీడీపీలో కరెంట్ ఖాతా లోటు దాదాపు 0.7 శాతంగా ఉంది. ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కరెంట్ ఖాతా మిగులును నమోదు చేసింది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది.

అసెంబ్లీ వద్ద ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

ఉండదు... ప్రజాస్వామ్యంలో మనం ఉన్నాం... అధికారంలో ఉన్నవారికి సెల్యూట్ కొట్టడంకాదని ఆయన తీరుపై వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేట్ దగ్గర పోలీసుల తీరుపై జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల చేతుల్లో ఉన్న పేపర్లు లాక్కుని, చింపే అధికారం ఎవరిచ్చారంటూ ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే మీ టోపీలపై ఉన్న సింహాలకు అర్థమని సూచించారు. ఈ సమయంలో మధుసూదన్‌రావు అనే పోలీసు అధికారిని ఉద్దేశించి జగన్ హెచ్చరించారు. అనంతరం అసెంబ్లీ హాలులోకి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగం ప్రారంభంతోనే, వైసీపీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హత్యా రాజకీయాలు నశించాలని, 'సేవ్ డెమోక్రసీ' అంటూ సభలో కొద్దిసేపు నినాదాల మధ్య గవర్నర్ ప్రసంగం కొనసాగింది. అనంతరం రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించడాన్ని నిరసిస్తూ సభ నుంచి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బాయ్‌కాట్ చేశారు.

కన్వర్ యాత్రలో పేర్ల ప్రదర్శనపై స్టే

(మొదటిపేజీ తరువాయి)

విరుద్ధమని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ ఈ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమాధానమివ్వాలని కోరింది. ఆహార విక్రయదారులు యజమానులు, ఉద్యోగుల పేర్లు రాయాలని బలవంతం చేయరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. తదుపరి విచారణను జులై 26కి వాయిదా వేసింది. ప్రభుత్వాల ఆదేశాల అమలును నిషేధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం సముచితమని తాము భావిస్తున్నామని, దుకాణదారులు ఆహార పదార్థాలను షాప్ బయట ప్రదర్శించాలరి ధర్మాసనం పేర్కొంది. కానీ యజమానులు, సిబ్బంది పేర్లు ప్రదర్శించాల్సిందిగా బలవంతం చేయకూడదని ఆదేశించింది. ప్రభుత్వాల నిర్ణయానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ సర్కార్‌లు సమాధానం చెప్పాలని స్పష్టంచేసింది. ఏటా శ్రావణమాసంలో చేపట్టే కావడి యాత్రలో భాగంగా శివభక్తులు నెల రోజులపాటు గంగానది జలాలను కావిళ్లతో సేకరించి స్వస్థలాలకు తరలిస్తారు. ఈ ఏడాది యాత్ర సోమవారం ప్రారంభమైంది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ఈ యాత్ర కోసం పటిష్ఠ భద్రతను ఏర్పాటుచేశాయి. దుకాణాల యజమానులు తమ పేర్లు ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలు వివాదాస్పదమయ్యాయి. ఈ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. మైనారిటీలపై జరుగుతున్న దాడిగా అభివర్ణిస్తున్నాయి. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ కన్వర్ యాత్రలు దశాబ్దాలుగా జరుగుతున్నాయని, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు సహా అన్ని మతాల ప్రజలు కన్వర్ యాత్రలో వెళ్తున్న వారికి సాయం చేస్తున్నారని సింఘ్వీ చెప్పారు. హిందువులు నడిపే వెజ్ రెస్టారెంట్లు చాలా ఉన్నాయని, వాటిలో ముస్లిం ఉద్యోగులు ఉండవచ్చునని, ఆ ఆహారం ముస్లింలు లేదా దళితులు ముట్టుకున్నందున అక్కడికి వెళ్లి తినబోమని చెప్పగలరా అని సింఘ్వీ ప్రశ్నించారు. ఇలాంటి వివాదాస్పద నిర్ణయాలపై ప్రభుత్వాలు పునరాలోచించాలని కోరారు.

భూ కబ్జాదారులను రక్షించేందుకే: నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అన్నమయ్యజిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం ఘటన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిందనే ప్రచారం అవాస్తవమని, భూ కబ్జాదారులను రక్షించేందుకే ఆ ఫైళ్లను తగులబెట్టారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ వ్యాఖ్యానించారు. నాలుగేళ్లుగా ఆ ప్రాంతంలో సీపీఐ నాయకుడు మురళీ అధ్వర్యంలో అనేక భూ కబ్జాలను వెలికి తీస్తున్నారని గుర్తుచేశారు. వాటిని ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన వీడియో సందేశంలో నారాయణ మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ కబ్జా దారులంతా ఒక్కటై పోయారని తెలిపారు. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వ హయాంలోనూ అలాగే అవుతున్నారా? అనేదీ తనకు అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం వచ్చాక మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవైతే ముఖ్యమైన ఫైళ్లు ఉన్నాయో...అవే తగలబడ్డాయని, మిగిలినవన్నీ బాగానే ఉన్నాయని తెలిపారు. దీని ఆధారంగా ఉద్దేశపూర్వకంగానే ఆ ఫైళ్లను తగులబెట్టి...భూ కబ్జాదారులను రక్షించాలన్న కుట్రకు తెరదీశారన్నారు. అటు తెలంగాణ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని తెలిసి...అర్ధరాత్రి పర్యాటక కార్యాలయంలోని ఫైళ్లను దగ్ధం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. మదనపల్లెలో భూ కబ్జాలను వెలికి తీసిన సీపీఐ నాయకుడు మురళీకి ప్రమాదం పొంచి ఉందని, ఆయనకు సీఎం చంద్రబాబు రక్షణ కల్పించాలని కోరారు. దాంతోపాటు అక్కడి భూ కబ్జాదారులను బయటపెట్టాలని, ఫైళ్ల దగ్ధం కేసుపై సమగ్ర విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని... అదే సమయంలో ఈ కేసును అధికారులు పక్కదారి పట్టించకుండా దోషులను కఠినంగా శిక్షించాలని నారాయణ డిమాండ్ చేశారు.

26 వరకు అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని నిర్ణయించారు. గవర్నర్ ప్రసంగంపై మంగళవారం చర్చించాలని, బుధవారం మరో మూడు నెలలకు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ ఉపసంహరణ బిల్లును ప్రభుత్వం మంగళవారం సభలో ప్రవేశ పెట్టనుంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు, ఎక్సైజ్ విధానం, రాష్ట్ర అప్పులు-ఆర్థిక స్థితికి సంబంధించి మూడు శ్వేతపత్రాలు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

సమ్మిళిత అభివృద్ధే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

తిరిగి గాడిలో పెట్టడం సవాలుతో కూడుకున్న పని. నా ప్రభుత్వం ఇప్పటికే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రారంభించడం ద్వారా సూపర్ సిక్స్ వాగ్దానాలకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించింది. ఇప్పటికే 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీని ప్రకటించడం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం, సామాజిక భద్రతా పింఛన్లను 4వేలకు పెంచడం, నైపుణ్య గణన నిర్వహించడం, పేదలకు నాణ్యమైన ఆహారాన్ని రూ.5లకే అందించేలా అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం, ఉచిత ఇసుక సరఫరా అమలుతోపాటు, ఇతర ముఖ్యమైన వాటిని కూడా ప్రారంభించి ప్రజల ఆకాంక్షలను పూర్తిస్థాయిలో నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందంటూ స్వామి వివేకానంద స్ఫూర్తిదాయకమైన మాటలతో గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.

తెలంగాణ తరహా రైతు రుణ మాఫీ

ఈశ్వరయ్య డిమాండ్

29 నుండి మదనపల్లెలో రైతుసంఘం రాష్ట్రస్థాయి సమ్మేళనాలు

విశాలాంధ్ర-కడప రూరల్: గతంలో టీడీపీ హామీ ఇచ్చిన రైతు రుణమాఫీ 4, 5 విడతల నిధులు చెల్లించాలని, తెలంగాణ తరహాలో రెండు లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి హాల్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈశ్వరయ్య మాట్లాడారు. 2019లో చంద్రబాబు అధికారం నుంచి దిగిపోవడంతో చివరి 4, 5 విడతల రుణమాఫీ చేయలేదని, తర్వాత అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనిని పట్టించుకోలేదని ఈశ్వరయ్య గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయినందున నాటి రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు వేసిన పంటలు చేతికి రాక అతివృష్టితో లేదా అనావృష్టితో అప్పుల పాలయ్యారని, తెలంగాణ ప్రభుత్వం తరహాలో రెండు లక్షల వరకు షరతులు లేని రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన రుణాలను బ్యాంకులు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం విరివిగా అందజేయాలని, రైతులు అధిక వడ్డీలతో అప్పుల పాలు కాకుండా మూడు లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందజేయాలని, 5 లక్షల వరకు పావలా వడ్డీకి రుణాలు అందజేయాలని కోరారు. రాష్ట్రంలో 76 లక్షల మంది సాగుదారులు ఉండగా...అందులో అధికారిక లెక్కల ప్రకారం 1,56,000 మంది కౌలు రైతులు ఉన్నారని, అనధికారికంగా లక్షలాది మంది కౌలు రైతులు ఉన్నారని, వారికి కూడా గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వం నుండి ప్రతి సాయం కవులు రైతులకు అందే విధంగా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో మదనపల్లెలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రస్థాయి సమ్మేళనాలు జరుగుతున్నాయని, ఈ సమ్మేళనాలలో రైతులు, కౌలు రైతులు, పాడి రైతులు, ఉద్యానవన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని, సమ్మేళనాలకు 26 జిల్లాల నుండి ప్రతినిధులు హాజరవుతారని, ముఖ్య అతిథులుగా అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరావు, సీబీఐ మాజీ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కడప జిల్లా గౌరవ అధ్యక్షుడు గాలి చంద్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్ పాల్గొన్నారు.

రామచంద్రయ్య, హరిప్రసాద్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా ఇటీవల ఎన్నికైన ఇద్దరు అభ్యర్థులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. శాసన మండలిలో సీ రామచంద్రయ్య, పిడుగు హరిప్రసాద్‌తో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు తన కార్యాలయంలో ప్రమాణం చేయించారు. అనంతరం వారికి అభినందనలు తెలుపుతూ, శాసన మండలి నియమ నిబంధనల పుస్తకాలను అందజేశారు. సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర కార్యక్రమం నిర్వహించారు. శాసన మండలి సభ్యులు పంచుమర్తి అనురాధ, జాయింట్ సెక్రటరీ ఎం.విజయరాజు పాల్గొన్నారు.

కౌలురైతుల సమస్యలపై చట్టసభల్లో చర్చించాలి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని, పరిష్కారానికి నిర్దిష్టమైన సమగ్ర విధానం తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య సోమవారం ఓ ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో కౌలు రైతులే గణనీయంగా ఉన్నారని తెలిపారు. కౌలు సేద్యం చేసే వారంతా చిన్న, సన్నకారు భూమిలేని నిరుపేదలేనని వివరించారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా కౌలురైతులను గుర్తించకపోవడం, వారి రక్షణ, సంక్షేమానికి చర్యలు చేపట్టకపోవడం ప్రభుత్వాలకు వ్యవసాయ రంగంపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు బీమా పథకాలను కౌలు రైతులకు వర్తింపజేయడంలేదని పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం కౌలు రైతులకు రూ.లక్షా 60వేల వరకు హామీలేని పంట రుణాలు మంజూరు చేయడం లేదన్నారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు జారీ, పెట్టుబడి సాయం, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం ఇచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పేర్కొన్నారు. వీటన్నింటినీ భూ యజమానులకే ఇస్తున్నారని వివరించారు. వ్యవసాయరంగానికి కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వాలు గణాంకాలు చూపిస్తున్నప్పటికీ... వాటిలో 10 శాతమూ కౌలు రైతులకు అందటలేదన్నారు. బడ్జెట్ సందర్భంగా కౌలురైతుల గురించి నాయకులు ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. కౌలు రైతుల సమస్యలపై అధ్యయన కమిటీ వేయాలని కోరారు.

వసతి గృహంలో నీటి సమస్య పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక కాకర్ల వీధిలోని బాలుర ఎస్సీ, ఎస్టీ వసతి గృహంలో నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ కోరారు. ఆదివారం బాలుర ఎస్సీ, ఎస్టీ వసతి గృహాన్ని ఏఐఎస్ఎఫ్ గుడివాడ నియోజకవర్గ సమితి అధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థులు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, వారు స్నానం చేయాలంటే మంచి నీరు కూడా లేనటువంటి దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ వసతి గృహంలోని బోరు రిపేర్ కావడంతో దానికి మరమ్మతులు చేయించకుండా బయట నుంచి పైప్ లైన్ ద్వారా వసతి గృహానికి కనెక్షన్ ఇవ్వడం వల్ల కలుషిత నీరు వస్తోందని విమర్శించారు. దీనివల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. 12 మరుగుదొడ్లు ఉంటే ఒక్క దానిలో కూడా కుళాయి ద్వారా నీరు అందడం లేదన్నారు. విద్యార్థులు నిద్రించేందుకు మంచాలు లేకపోవడంతో వారు నేల పైనే నిద్ర పోవలసిన దుస్థితి నెలకొందని, ఉన్నత స్థాయి అధికారులు వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా కన్వీనర్ సాదిక్, నాయకులు సన్నీ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

బాబాయి హత్యపై దిల్లీలో ధర్నా చేయండి

జగన్‌పై సంధ్యారాణి ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత జగన్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని, దమ్ముంటే వాళ్ల బాబాయి హత్యపై దిల్లీలో ధర్నా చేయాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచించారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు కావలి ప్రతిభా భారతితో కలిసి మంత్రి వినతిపత్రాలను స్వీకరించారు. సంధ్యా రాణి మాట్లాడుతూ... వైసీపీ నేతలకు అబద్ధాలు ఆడటం వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. జగన్, ఆపార్టీ నేతలు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ముందు చూపునకు, కార్యదక్షతకు ఎన్ని జన్మలెత్తిన ఆయన రుణం తీర్చుకోలేమన్నారు.గవర్నర్ దగ్గరకు వెళ్లి లేఖ ఇవ్వడం, రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీ చినాన్న హత్యపై సొంత అక్కచెల్లెల్లు పోరాడుతుంటే... ఎందుకు జగన్ మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. దిల్లీకి వెళ్లి వివేకానందరెడ్డి హత్యపై సీబీఐ విచారణ చేయించాలని ధర్నా చేయగలవా అని ప్రశ్నించారు. 30వేల మంది ఆడపిల్లలు కనిపించకుండా పోతే ఒక్క మాట మాట్లాడలేదన్నారు. కోడికత్తి శ్రీను, ఓంప్రతాప్, హనుమాయమ్మ, స్నేహలత, రమ్య, వెంకాయమ్మ, శాంకుమార్, కర్రి శ్రీకాంత్, జడ్జి రామకృష్ణ గుర్తులేదా?, ఇలా ఎంతమంది మీ చేతుల్లో హతులు అయ్యారో తెలియదా అని నిలదీశారు. ప్రతిభా భారతి మాట్లాడుతూ... రాయలసీమ నుంచి శ్రీకాకుళం వరకు ప్రజలు అర్జీలు తీసుకుని వస్తున్నారన్నారు.

నూజివీడు మామిడికి గడ్డు రోజులు

కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: ప్రపంచ స్థాయిలో పేరుగాంచిన నూజివీడు మామిడికి గడ్డు పరిస్థితి ఏర్పడిందని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో నూజివీడు అమర్ భవన్‌లో ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు టి.సోమశేఖర అధ్యక్షతన మామిడి రైతుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ మామిడి ఉత్పత్తిలో రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉందన్నారు. నూజివీడు ప్రాంత మామిడి పండ్లలో రారాజు అన్నారు. అయితే గత కొన్నేళ్లుగా మామిడి రైతాంగం నష్టాలు ఎదుర్కోవడం బాధాకరమన్నారు. ప్రతికూల వాతావరణంలో కూడా మామిడి సాగు చేసి పంట అమ్ముకోవడానికి కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తుందని తెలిపారు. మామిడి రైతులు నష్టాల బారిన పడకుండా రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘం నాయకులు, వ్యాపారులు సంఘటితంగా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మామిడి పరిశోధనా కేంద్రాలను విస్తృత పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాలో 63 వేల హెక్టార్లకు పైగా మామిడి సాగు చేస్తున్నారని తెలిపారు. మామిడి రైతాంగం నాణ్యమైన పంటతో పాటు అధిక దిగుబడి సాధించాలంటే కొమ్మ కత్తిరింపు, అలాగే కొత్తగా మామిడి సాగు చేసేవారు ఎకరాకు 200 నుంచి 300 వరకు మొక్కలు నాటడం మంచిదన్నారు. నీరు తడులు వేసే సమయంలో రసాయన ఎరువులు కలిపి అందిస్తే మంచిదన్నారు. సెప్టెంబరు నుంచి జింక్, బోరాన్, పొటాషియం నైట్రేట్, పొటాషియం సల్ఫేట్ పంటకు అందిస్తే మంచిదన్నారు. అలాగే మామిడి కాయలకు కవర్లు తొడగటం వల్ల పంటలో నాణ్యత పెరుగుతుందన్నారు. నూజివీడు రైతాంగం సంయుక్తంగా నాణ్యమైన పంట అందించాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. నూజివీడు చిన్న రసాలకు జాతీయ స్థాయిలో సర్టిఫికెట్లు తీసుకొచ్చి పేటెంట్ హక్కులు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మామిడి రైతాంగం ఎప్పుడైనా పరిశోధన స్థానానికి వచ్చి తమ సందేహాలను అడిగి పరిష్కార మార్గాలను తెలుసుకోవచ్చన్నారు. అనంతరం రైతుల సందేహాలకు శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి సమాధానమిచ్చారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతాంగం కాలానుగుణంగా వచ్చే మార్పులను అందిపుచ్చుకొని కొత్త మెలకువలతో నాణ్యమైన పంటను పండించాల్సి ఉందన్నారు. అలాగే మామిడి పంట సమయంలోనే ఉపాధి హామీ పథకం ప్రారంభమవుతున్నందున కూలీల కొరత ఏర్పడుతుందని, అందుకు ప్రభుత్వం మామిడి కోతలను ఉపాధి హామీకి అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సదస్సులో ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాపంచల జమలయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మణరావు, ఉపాధ్యక్షులు దేగా ప్రభాకర్ రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, రైతు సంఘం నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, చలసాని వెంకట రామారావు, సీపీఐ ఎంఎల్ నాయకులు హరినాథ్, ఉద్యాన శాఖ ఏడీ రామ్మోహన్ రావు, వ్యవసాయ శాఖ ఏడీ విద్యా సాగర్, సీపీఐ నాయకులు బత్తుల వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా బాధ్యత చంద్రబాబుదే

నాడు జగన్ ఎన్నిసార్లు ధర్నాలు చేశారు?

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతిసారి ప్రత్యేక హోదా అంశం అటకెక్కుతోందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి హోదా తెచ్చే బాధ్యత చంద్రబాబు పైనే ఉందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యానించారు. పదేళ్లుగా హోదా మీద పోరాటాలు జరుగుతున్నప్పటికీ... కేంద్రం స్పందించడం లేదన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో సోమవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు మోదీపై బాబు విమర్శలు చేశారని, మరి ఇప్పుడు హోదా మీద ఏం చెబుతారని నిలదీశారు. ప్రత్యేక హోదా అనేది రాష్ట్రానికి సంజీవని అని, హోదా వస్తేనే రాయితీలు, ఉద్యోగాలు వస్తాయని వివరించారు. హోదా కావాలని బీహార్ వాళ్లు అడిగితే... టీడీపీ వాళ్లు హోదా మీద నోరు విప్పడం లేదన్నారు. మన ఎంపీలను వాడుకుని బీజేపీ అధికారంలో ఉందని, ఇప్పటికైనా హోదాపై బాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ పోరాటం చేస్తూనే ఉంటుందని పునరుద్ఘాటించారు. జగన్ హత్యా రాజకీయాలు చేశారని, హత్య చేసిన వాళ్లతోనే కలిసి తిరిగారని విమర్శించారు. సొంత చెల్లెళ్లకే వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. నాడు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు హోదాపై ఎందుకు ధర్నాలు చేయలేదని ప్రశ్నించారు. జగన్ పాలనలో ఎన్నిసార్లు ధర్నాలు చేశారో చెప్పాలంటూ నిలదీశారు. కార్యకర్త హత్యపై ఇప్పుడు దిల్లీలో ధర్నాకు సిద్ధమవ్వడాన్ని తప్పుపట్టారు. వినుకొండలో హత్య వ్యక్తిగత కారణాలతోనే జరిగినట్లుగా తమ విచారణలో తేలిందని, అది రాజకీయ హత్య కాదని చెప్పారు. అటు రాష్ట్రంలో వరదలతో రైతులు అల్లాడుతుంటే, అసెంబ్లీలో జగన్ గళం వినిపించకుండా దిల్లీకి వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో రైతులు చితికిపోగా, ఇప్పుడు భారీ వర్షాలతో మరింతగా కుంగిపోయారని చెప్పారు. నాడు రైతుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి పెద్దపీట వేస్తే... ఆయన తలపెట్టిన జలయజ్ఞం కార్యక్రమాన్ని జగన్ విస్మరించారన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి సర్కారు బలంతో కేంద్రంలోని బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ... మన రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి చెందిన 25 మంది ఎంపీలను బీజేపీ వాడుకుని వదిలేసిందన్నారు. పోలవరం, రాజధాని నిర్మాణానికి కేంద్రం నిధులు ఇస్తుందా?, లేదా? అని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించాలని, విశాఖ రైల్వే జోన్ అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ బీమా అమలు

అధికారులతో మంత్రుల సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ బీమా అమలు చేయాలని, విపత్తు సమయాల్లో వారికి న్యాయం జరగాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం పంటల బీమాపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో బీమా వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, ప్రీమియం చెల్లింపులు జరగలేదన్నారు. విపత్తు సమయాల్లో రైతులకు న్యాయం జరిగేలా బీమా అమలు కావాలని సూచించారు. దిగుబడి, వాతావరణ పరిస్థితుల ఆధారంగా బీమా అమలులో ఉన్న అవకాశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. క్లెయిమ్‌లు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి నివేదికను ముఖ్యమంత్రికి పంపారు. వైసీపీ ప్రభుత్వంలో మామిడి రైతులకు బీమా అమలు చేయలేదని, వారికి బీమా అమలు చేసే అవకాశాలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఉద్యాన, మత్స్య శాఖల కార్యదర్శి అహ్మద్‌బాబు, వ్యవసాయశాఖ కమిషనర్ దిల్లీరావు, ఉద్యానశాఖ కమిషనర్ కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-ఏలూరు: విద్యుత్ మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మీటర్ రీడర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ మీటర్ రీడర్ల ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమావేశం యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కే శివారెడ్డి అధ్యక్షతన స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయ స్ఫూర్తి భవనంలో సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మీటర్ రీడర్లకు చాలా అన్యాయానికి గురి చేసిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం మీటర్ రీడర్లకు న్యాయం చేయాలని కోరారు. శివారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మీటర్ రీడర్లకు పీస్ రేట్ సక్రమంగా కాంట్రాక్టర్లు చెల్లించటలేదని ఆరోపించారు. యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. జీతాలు స్కానింగ్ అవ్వలేదని, ఫోటో ఇమేజ్ సరిగా రాలేదని ఎన్నో సాకులు చెప్పి యాజమాన్యం కూడా జీతాలలో కోతలు విధిస్తుందని అన్నారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐటీఐ చదివిన వారికి ఆపరేటర్ గా, నాన్ ఐటీఐ వారికి విద్యార్హతను బట్టి విద్యుత్ సంస్థలోనే ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్క్రో అకౌంట్, మినిట్స్‌ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా ఓ శ్రీనివాస్, కార్యదర్శిగా జి.దుర్గరావు కోశాధికారిగా కె.మల్లేశ్వరావు ఎన్నిక య్యారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యారంగం బలోపేతంపై అసెంబ్లీలో చర్చించాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగంపై పూర్తి స్థాయిలో చర్చించి విద్యారంగ బలోపేతం కోసం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం. సాయికుమార్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో విద్యారంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 107 ,108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరంలో పులివెందుల, మార్కాపురం, మదనపల్లి, పాడేరు, ఆదోనిలో కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జీవో నెంబర్ 117ను రద్దు చేసి మూడు, నాలుగు, ఐదు తరగతులు విలీనం పేరుతో మూతబడ్డ 4,500 ప్రాథమిక పాఠశాలలను వెంటనే పున: ప్రారంభించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వండి

కలెక్టరేట్ వద్ద పేదల ధర్నా

విశాలాంధ్ర-పుట్టపర్తి: ఎంతో కాలంగా నివాసం ఉంటున్న తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సత్యసాయి జిల్లా బత్తలపల్లి, కదిరికి చెందిన పేదలు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బైఠాయించి ధర్నా చేశారు. బత్తులపల్లి మండలం సర్వే నంబర్ 401లో, కదిరి అర్బన్ దివ్యాంగుల కాలనీ సర్వే నంబర్ 83లో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నామని అన్నారు. తమకు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. భూకబ్జాదారుల నుంచి రక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొందరు నాయకులు, భూకబ్జాదారులు దొంగ పత్రాలు సృష్టించి భూమిని కాజేశారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో రికార్డులు సృష్టించి కబ్జా చేయడమే కాకుండా ఆ భూమిని వేరొకరి అమ్మి రిజిస్ట్రేషన్ చేయించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ధర్మవరం సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో రికార్డులు కూడా తారుమారు చేయకుండా, ఎన్‌ఓసి ఇవ్వకుండా సబ్ రిజిస్టార్ కు వినతిపత్రం అందజేశామన్నారు. మఠం భూములను అక్రమంగా ఆన్‌లైన్‌లో పొందుపరిచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత సంఘం రాష్ట్ర కార్యదర్శి జింక చలపతి, వెంకటేష్ , కుల్లాయప్ప, సత్యప్ప నాగభూషణ, మధు నాయక్, వెంకటరమణ, మహిళా సమైక్య నాయకురాలు కళావతి , అనూష, రత్నమ్మ, భవాని, శాంతమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాన్స్‌వరల్డ్ ఫర్టికెమ్ ప్రైవేట్ లిమిటెడ్

నోటీసు

భారత రైతాంగానికి అంతర్జాతీయ ప్రామాణికమైన ఎరువులను అందించే ట్రాన్స్‌వరల్డ్ ఫర్టికెమ్ ప్రైవేట్ లిమిటెడ్ క్రింద తెలుపబడిన నీటిలో కరిగే మిశ్రమ ఎరువులను Ministry of Agriculture తేది:24-10-2015 ఆర్డరు ప్రకారం అందిస్తుంది.

వ.నెం.	ఎరువు పేరు	ఎరువుల రకం
1	NPK 15-15-30-02 TE	100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువులు
2	NPK 16-08-32-02 TE	100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువులు
3	NPK 00-09-46-15 TE	100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువులు
4	NPK 11-44-11-02 TE	100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువులు
5	NPK 5-55-17 TE	100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువులు
6	NPK 06-45-06+5S+5Mgo+TE	100% నీటిలో కరిగే మిశ్రమ ఎరువులు

విశిష్ట లక్షణాలు: 1. 100 శాతం నీటిలో కరిగే ఎరువులు 2. పంట నాణ్యత మరియు దిగుబడిని పెంపొందించును 3. ఈ ఎరువులు డ్రిప్ ద్వారా మరియు పిచికారి ఎరువులుగా వాడవచ్చును. (Packing : Available in 1 Kg, 5 Kg, 10 Kg, & 25 Kg)

ట్రాన్స్‌వరల్డ్ ఫర్టికెమ్ ప్రైవేట్ లిమిటెడ్ డోర్ నెం.76-2-21ఎ, భవానీపురం, ఐరన్ యార్డు, విజయవాడ-520 012 (ఎ.పి.), ఇండియా

సంపాదకీయం

రాజకీయ క్రీడగా ప్రత్యేక ప్రతిపత్తి

ఆంధ్రప్రదేశ్, బీహార్, ఒడిశా లాంటి రాష్ట్రాలు తమ రాష్ట్రాలకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించాలని అడుగుతున్నాయి. నిజానికి ఒడిశాలో 20 ఏళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు బిజూ జనతా దళ్ అధినేత నవీన్ పట్నాయక్ ఎన్నడూ ఈ ఊసే ఎత్తలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయిన తరవాత మాత్రమే బీజేడీ తమ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి ప్రస్తావన తీసుకొస్తోంది. ఆంధ్ర ప్రదేశ్‌లో మొన్నటి దాకా అధికారంలో ఉన్న వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ కూడా అధికారంలో ఉన్నన్నాళ్లు ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వాలని గట్టిగా కోరిన సందర్భమే లేదు. కేవలం ప్రధానమంత్రికి వినతిపత్రాలు సమర్పించే తంతుతోనే సరిపెట్టుకున్నది. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నందువల్ల జనాన్ని ఆకర్షించడానికి వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ ప్రత్యేక ప్రతిపత్తి రాగాలాపన మొదలెట్టింది. ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి మరో విచిత్రం ఏమిటంటే ప్రతిపక్షంలో ఉన్నన్నాళ్లు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రతిపత్తి అని యాగీ చేసిన చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ ఆ అంశానికి సంబంధించి కాడి కింద పడేసినట్టే ఉంది. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది కనక ఆర్థికంగా ఎక్కువ నిధులు సమకూర్చే ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే చాలునని చంద్రబాబు బాహాటంగానే చెప్తున్నారు. ఈ విషయంలో నితీశ్‌కుమార్ నాయకత్వంలోని జనతా దళ్ (జె.డి.యు) పైకి కనిపించడానికైనా చిత్తశుద్ధి ఉన్నట్టు నమ్మించే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల జరిగిన జె.డి.(యు) సమావేశంలో బీహార్‌కు ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వాల్సిందేనని తీర్మానం ఆమోదించారు. అయితే బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మాత్రం ఈ మాట గట్టిగా అడగడంలేదు. చంద్రబాబు, నితీశ్ కుమార్ సార్వత్రిక ఎన్నికల తరవాత మెజారిటీ తక్కువైన మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడడానికి ఎన్.డి.ఎ. కూటమికి మద్దతిచ్చారు. ఈ ఇద్దరు ముఖ్యమంత్రుల కోరికల చిట్టా చాంతాడంత ఉన్న మాట వాస్తవమే కానీ ఆ కోర్కెలు తీర్చకపోతే మోదీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తామని మాత్రం చెప్పడంలేదు. చంద్రబాబు నాయుడు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. కానీ కేంద్రంలో చక్రం తిప్పడానికి వీరిద్దరూ ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇద్దరికీ అపారమైన రాజకీయ అనుభవం ఉంది కనక అవసరార్థం ఎప్పుడైనా మాట మార్చగలరు. ఒడిశా అంశం ఇప్పుడే తెర మీదకు వచ్చింది. మొన్నటి ఎన్నికలలో నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బిజూ జనతాదళ్ మళ్లీ గెలిచి ఉంటే ఒడిశాకు ప్రత్యేక ప్రతిపత్తి అనే ప్రస్తావనే వచ్చేది కాదేమో. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నందువల్ల నిరంతర పోరాటానికి అది ఒక బలమైన అంశం కావాలి కనక ఈ కొత్త రాగం ఎత్తుకున్నట్టున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయింది. మొదటి అయిదేళ్లూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు. తరవాత అయిదేళ్లు జగన్ ఆ పదవిలో ఉన్నారు. చంద్రబాబు మొదటి దఫా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ప్రత్యేక ప్రతిపత్తి కల్పించనందువల్ల తెలుగుదేశం పార్టీ 2018 లో ఎన్.డి.ఎ. కూటమితో తెగ తెంపులు చేసుకుంది. ఆ తరవాత జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం ప్రతిపక్షంలో ఉండవలసి వచ్చింది కనక ప్రత్యేక హోదా మీద అప్పుడప్పుడూ గొంతెత్తుతూనే ఉంది. ఇప్పుడు మళ్లీ తెలుగు దేశం ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది. చంద్రబాబే ముఖ్యమంత్రి. ప్రత్యేక హోదా గురించి ఏ హామీ లేకుండానే చంద్రబాబు మైనారిటీలో పడిపోయిన మోదీ మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సహకరించారు. బీహార్‌ను విడగొట్టి జార్ఖండ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసిన దగ్గరనుంచి బీహార్ తమకు ప్రత్యేక హోదా కావాలని అడుగుతూనే ఉంది. ఇందులోనూ తేడాలున్నాయి. కొన్నాళ్లు బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించడం, ఆ తరవాత ఆ బీజేపీతోనే కలిసి బీహార్‌లో అధికారం పంచుకోవడం నితీశ్ కుమార్‌కు కొత్తకాదు. సార్వత్రిక ఎన్నికలకు ముందే నితీశ్ మళ్లీ బీజేపీతో కత్తు కలిపారు. అప్పుడు ఆయన బీహార్‌కు ప్రత్యేకహోదా కోర్కెను బలహీనంగానైనా వ్యక్తం చేసిన దాఖలాలు లేవు. ఇప్పుడు కేంద్రంలో మోదీ సర్కారుకు మద్దతు ఇచ్చినప్పుడూ ఆ షరతు విధించలేదు. కానీ జె.డి (యు) ఓ తీర్మానం అయితే ఆమోదించింది. మొన్నటి శాసనసభ, లోక్‌సభ ఎన్నికలకు ముందు విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికలో తెలుగు దేశం ప్రత్యేక ప్యాకేజీ ప్రస్తావన తీసుకొచ్చింది. విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని కూడా తెలుగు దేశం వాగ్దానం చేసింది. ట్రూ అప్ చార్జీల పేర కొనసాగుతున్న అదనపు వడ్డింపును తొలగిస్తానని కూడా చంద్రబాబు చెప్పారు. ఇవన్నీ చేయాలంటే రూ. 28, 000 కోట్లకు మించి అవసరం అవుతుందంటున్నారు. జగన్ ఖజానా ఖాళీచేసి పోయాడని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాడని విద్యుత్ శాఖపై విడుదల చేసిన శ్వేత పత్రంలో చంద్రబాబు ప్రభుత్వం పేర్కొంది. అది నిజమేననుకున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి నిధులైతే కావాలిగా. ప్రత్యేక హోదా సాధించడానికి కాళ్లీడిస్తే ప్రధానమైన ఆరు వాగ్దానాలను ఎలా అమలు చేస్తారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వానికి తెలుగు దేశం మద్దతు అవసరం కనక ఒత్తిడి తీసుకొచ్చే పని అయినా చేయకపోతే సంపద సృష్టిస్తాం అన్న కల ఎలా నెరవేరుతుంది? ప్రత్యేక హోదా సాధించగలిగితే అంగన్వాడీ, గ్రామీణ ఉపాధి హామీ పథకం లాంటి వాటికి అయ్యే ఖర్చులో కేంద్రం 90 శాతం భరించాలి. ఇప్పుడు 60 శాతమే భరిస్తోంది. పైగా బోలెడు రాయితీలు దక్కుతాయి కనక పరిశ్రమలు నెలకొల్పే వారు మన రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి ఉత్సాహం చూపుతారు. ప్రత్యేక హోదా కోసం అఖిలపక్ష ప్రతినిధి వర్గాన్ని దిల్లీకి తీసుకెళ్లడం లాంటి ఆలోచనే చంద్రబాబుకు ఉన్నట్టు లేదు. ఇది చిత్తశుద్ధి లోపాన్నే సూచిస్తోంది. మునుపటి ప్రభుత్వం చేసిన తప్పులెన్నడానికి ఎన్ని శ్వేత పత్రాలు విడుదలు చేసినా ఫలితం ఉండదు. హామీలను నెరవేర్చడానికి నిధులు, రాయితీలు సాధించాలంటే ప్రత్యేక హోదా కోసం గట్టిగా కృషి చేయాల్సిందే. చంద్రబాబుకు ఆ ఆసక్తి ఉన్నట్టు లేదు. బీహార్ కు ప్రత్యేక హోదా ప్రసక్తే లేదని సోమవారం పార్లమెంటులోనే మోదీ ప్రభుత్వం ఖండితంగా చెప్పింది. ఈ మాట చంద్రబాబుకు వినిపించలేదా!

అభిషేకం

చింతపట్ల సుదర్శన్

పొద్దున వచ్చిన వాన, పొద్దుగూకంగ వచ్చిన చుట్టం ఓపట్టాన వదలనన్నట్టు మూడు రోజులు ముసుర్లూ, జల్లులూ, జడులూ కురిపించిన వాన తెరిపిచ్చింది. మబ్బులు మాయమవడంలో సూరీడు ఆకాశంలో గాజు పేపర్ వెయిట్‌లా మెరవసాగాడు.

మూడునాళ్ల నించీ వానలో తడుస్తూ చెత్తాచెదారంలో దొరికిందేమో నమిలి ఎంతో కుమిలిపోయిన డాగీకి, కొంచెం ఉషారొచ్చి చెవులు దులిపి, తోక విదిలించి రోడ్డు ఎక్కింది. మంత్రుల హామీల్ని మధ్యలోవాళ్లు తుంగలో తొక్కడం మామూలే కద. ఎండ ఇచ్చిన ఉషారు బేజారుగా మారడానికి ఆట్టే తిరగాల్సిన అవసరం లేకపోయింది గోడ గడియారానికి.

మాంసం కొట్టు తాళం వెక్కిరించింది. మాంసాహారం పంటికి తగలకపోతే పోయింది, చప్పరించడానికి నాలుకకి ఏమైనా దొరక్కపోదు అనుకుంటూ వీధంట నడుస్తున్న డాగీకి గుంపులుగా జనం కనపడ్డారు. మళ్లీ 'రోడ్డు షో' నా లేక పడిపోతుంది ప్రభుత్వం పడిపోతుంది అనే పిల్లి శాపాలకు, నిజంగానే అలాంటిదేమయినా జరిగిందా అనుకుంది డాగీ.

రంగస్థలం

జనం ఓ పెద్ద వాల్‌పోస్టర్ పట్టుకుని చౌరస్తాలో గుమిగూడేరు. ఓ ఎలక్ట్రిక్ స్తంభం చాటున నిలబడి ఈ తాజా తమాషా ఏమిటో చూసి తరించవలసిందే అనుకుంది డాగీ. చౌరస్తా మధ్యన నిలబడి ఉన్నది ఓ నాయకుడి చిత్రపటం. దానికి ఆ పక్కా ఈ పక్కా నిలబడున్నారు మనుషులు. ఇప్పుడు వీళ్లంతాకల్సి ఆ చిత్రపటాన్ని ఏం చేయబోతున్నారు? కాలుస్తారా లేక పూడుస్తారా చూద్దాం తాగబోతూ రుచి అడగడం దేనికి అనుకుంది. తినబోతూ అనడానికి బదులు తాగబోతూ అన్ని అన్నానెందుకో అని నాలుక కర్చుకుంది.

ఓ మనిషి నెత్తిమీద బిందె, చేతిలో గ్లాసుతో వచ్చాడు. ఆ బిందెలో ఏమున్నదని కుతూహలపడింది డాగీ. బిందె కిందకు దించారు. దాన్నిండా తెల్లని నీళ్లు. నీళ్లు కావు అవి పాలు. అయితే నీళ్లు కల్సిన పాలవవచ్చు కానవి పాలే. తెల్లని పాలే కాని నల్లని నీళ్లు మాత్రం కావు. ఆ చిత్రపటంలో ఉన్న మనిషి ఎవరో అర్థం కాలేదు డాగీకి. రోజూ న్యూస్ పేపర్లు నమిలే డాంకీ ఉంటే టక్కున చెప్పేసి ఉండును. సివిల్స్ రాసే వాళ్లకున్నంత తెలివి ఉంది కాని గాడిదైపోయింది కనుక కలెక్టర్‌వలేకపోయింది అనుకున్న డాగీకి జనం జిందాబాద్ కేకలు పెద్ద పెట్టున వినిపించి జడుసుకుంది. తోకతో వీపు మీద కొట్టుకుంది.

జనంలోంచి ఒకడు ముందుకువచ్చి గ్లాసు నిండా పాలు తీసుకుని చిత్రపటం తలమీది నుంచి కిందకి కారేట్టు పోశాడు. జిందాబాద్‌లు కంటిన్యూ అవుతుంటే ఒకరి తర్వాత ఒకరువచ్చి గ్లాసు బిందెలో ముంచి పాలతో చిత్రపటాన్ని తడిపేయసాగారు. ఇదేమిటి 'చిత్రం' తడిసి ముద్దయిపోతున్నది. అయినా చిత్రపటం నెత్తిన పాలు పోయడమెందుకు ఆకలితో ఉన్న మనుషుల నోటికో, నాలాంటి వీధికుక్క నాలుకకో అందిస్తే పుణ్యం దక్కేది కదా అనుకుంది డాగీ నాలుక బయటకి వేలాడేసి.

జనం జిందాబాద్‌లు క్రమంగా తగ్గేయి. కాస్సేపటికి అక్కడ ఎవరూలేరు. ఇక మనమూ తిండికి వెదుక్కుంటూ పోవాలి అనుకున్న డాంకీ కాళ్లకి ఏదో తడి తగిలింది. ఏమిటా అని తలదించి చూస్తే చిత్రపటం నెత్తిన పోసినపాలు కాళ్లకు తగులుతూ పక్కనే ఉన్న చిన్న గొయ్యిలో పడుతున్నది. అదృష్టం కాలు తడపడం అంటే ఇదన్న మాట అనుకుంటూ పాలు నిండిన గుంతలో మూతిపెట్టింది డాగీ. నాలుకతో ఓ రౌండు 'కతికి' తలెత్తి చూసింది. వేరే కుక్కలు ఏవైనా 'షేర్' చేసుకుందుకు వస్తున్నయేమోనని. కానీ చుట్టుపక్కల మనుషులకే కాదు కుక్కలు కూడా లేవు. పాలు మరీ రుచిగా లేవు నీళ్లు బాగానే కలిపినట్టున్నారు. అయితేనేం కడుపునిండా తాగడానికి దొరికినవి కదా అని తన నాలుకకు పని చెప్పింది డాగీ.

అరుగు మీదికి వచ్చిన డాగీ ముక్కూ మూతీ తెల్లగా కనపడ్డంతో అడగనే అడిగింది డాంకీ. 'క్యా బాత్ హై' అని. ఏముందీ పాల గుంతలో నోరు ముంచా అంటూ చిత్రపటానికి జనం పాలుపోసిన విషయాన్ని వివరించి, అడిగింది డాంకీ 'బ్రో' వాళ్లంతా ఆ చిత్రపటం నెత్తిన పాలు ఎందుకు పోశారు అని. అది నెత్తిన పాలుపోయడం కాదు. అభిషేకం. పాలాభిషేకం. హామీలు కొద్దోగొప్పో నిజం చేసిన వారికి, రూపాయికి పది పైసలైనా విదిలించిన వారికి అభిమానంతో జనం పాలతో అభిషేకం చెయ్యడం ఇప్పుడు 'ట్రెండీ' అయిన సంగతి. జనం తమంతట తాము చచ్చేంత అభిమానంతో అభిషేకం చేస్తారా లేక తామే చేయించుకునేవారుంటారా అంది డాగీ. చేసినా, చేయించుకున్నా అభిషేకం అభిషేకమే, పైత్యం పైత్యమే అంటూ అరుగు ఎక్కాడు అబ్బాయి. పైత్యమో, వేయి తలల వెర్రో ఎవరికి తెలుసు. ప్రజల్ని పాలించడం ఓ డ్యూటీ. ఆ డ్యూటీ చేసిన వాడు దేవుడు కాదు గదా అంది డాంకీ.

గుళ్లో దేవుడికి పెరుగుతో, నెయ్యితో కూడా అభిషేకం చేస్తారు. ఈ నాయక దేవుళ్ల అభిషేకానికి పాలు మాత్రమే వాడుతున్నందుకు సంతోషించాలి అన్నాడు అబ్బాయి. ఇంతమంది నాయకులున్నారు. రోజూ ఒకరికిలా 'పాలాభిషేకం' చేస్తే నాలాంటి కుక్కలకే కాదు గోడ మీది పిల్లులకు కూడా కడుపు నిండును కదా అంది డాగీ.

బీజేపీ విభజన అజెండాకు సుప్రీం షాక్

ఎం కోటేశ్వరరావు

జులై 22 నుంచి ఆగస్టు ఆరు వరకు జరిపే కన్వర్-కావడి యాత్రల సందర్భంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వు అమలును సోమవారం సుప్రీం కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ఇది బీజేపీ హిందూత్వ ఎజెండాకు ఎదురు దెబ్బ. యాత్రలు జరిగే దారిలో ఉన్న దుకాణాలు, హోటళ్లు, పానీయాల దుకాణాల యజమానుల పేర్లను సంస్థల ముందు ప్రదర్శించాలని ప్రభుత్వాలు ఆదేశించాయి. వాటిలో హలాల్ ధృవీకరణ పత్రం ఉన్న పదార్థాలను విక్రయించరాదని కూడా పేర్కొన్నారు. యాత్రల పవిత్రతను కాపాడేందుకు అని చెబుతున్నప్పటికీ అధికారిక ఉత్తర్వుల్లో శాంతి భద్రతలను సాకుగా చూపారు. ఈ ఆదేశాలను సుప్రీం కోర్టులో సవాలు చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం ప్రకారం పేర్ల ప్రదర్శనకు బ్రేకు పడింది. అయితే ఆహార పదార్థాల స్వభావాన్ని వినియోగదారులకు ప్రదర్శించాలని కోర్టు పేర్కొన్నది. పోలీసులు తీసుకున్న చర్యలతో ఆందోళనకర పరిస్థితి ఏర్పడిందని, సామాజికంగా వెనుకబడిన తరగతులు, మైనారిటీలను ఆర్థికంగా విడదీస్తుందని పిటీషనర్ల తరఫున వాదించిన సీయూ సింగ్ చెప్పారు. మరో న్యాయవాది అభిషేక్ సింఘ్వి తన వాదనలను వినిపిస్తూ " నేను గనుక పేరును ప్రదర్శించకపోతే నన్ను మినహాయిస్తారు, నేను పేరును ప్రదర్శించినా మినహాయిస్తారని" చెప్పారు. అయ్యప్ప, భవానీ వంటి దీక్షలు, కన్వర్(కావడి) యాత్ర వంటివి జనాల వ్యక్తిగత అంశాలు. ఇష్టమైనవారు పాటిస్తారు, కాని వారు దూరంగా ఉంటారు. వీరంతా నాస్తికులని గానీ పాటించేవారే పరమ ఆస్తికులని గానీ నిర్ధారించటానికి, ముద్రవేసేందుకు ఎవరికీ హక్కులేదు. పౌరహక్కుల పరిరక్షణ సంస్థ(ఏపీసీఆర్) పేరుతో ఉన్న ఒక స్వచ్ఛంద సంస్థ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను సవాలుచేస్తూ సుప్రీం కోర్టు తలుపుతట్టింది. న్యాయమూర్తులు హృషికేశ్ రాయ్, ఎస్‌వీఎన్ భట్ ధర్మాసనం సోమవారం విచారించింది. ప్రభుత్వ ఉత్తర్వుల కారణంగా దుకాణాల యజమానుల మతపరమైన గుర్తింపు వెల్లడి కావటమేగాక ముస్లిం మతానికి చెందిన దుకాణాల యజమానులపై వివక్ష ప్రదర్శించటమే అని పిటీషన్‌లో పేర్కొన్నారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో అనేక ప్రతిపక్ష పార్టీలు ఈ ఆదేశాలను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంటూ, తాము పార్లమెంటులో ప్రస్తావిస్తామని అధికారపక్షానికి స్పష్టం చేశాయి. కోర్టు ఆదేశాలతో దీని మీద చర్చ జరుగుతుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

బీజేపి మిత్రపక్షాలుగా ఉన్న జేడీయూ, ఎల్‌జేపీ, ఆర్‌ఎల్‌డి పార్టీలు ఇలాంటి ఉత్తర్వులు తగవని చెప్పినా బీజేపీ ఖాతరు చేయలేదు. జనాలను మత ప్రాతిపదికన చీల్చే, ముస్లింలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే ఎజండాను అమలు జరిపేందుకే పూనుకున్నట్లు కనిపిస్తోంది. గతంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిన ఉదంతాలు ఉన్నాయి. ఇప్పుడు తాజా పరిణామాల వెనుక ఉన్న కుట్రలేమిటి, ఏం జరగనుంది అన్నది ఆసక్తికరంగా, ఆందోళనకరంగా మారింది. తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆయోధ్యతో సహా అనేక చోట్ల చావుదెబ్బతిన్నది. దీనికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కారణమంటూ కేంద్ర పెద్దల మద్దతుతో బీజేపీ స్థానిక నేతలు ధ్వజమెత్తటమే కాదు, నాయకత్వమార్పు జరగాలని కోరుతున్నారు. మరో వైపున దానికి ప్రతిగా యోగి కూడా తన అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. వాటిలో కన్వర్ యాత్రల ఆదేశం ఒకటి. శివలింగం మీద తేలును చెప్పుతో కొట్టలేరు, చేతితో తొలగించలేరు అన్నట్లుగా కేంద్ర బీజేపీ నాయకత్వం ముందు పరిస్థితి ఉంది. ఇంతకూ ఈ యాత్రీకులు చేసేదేమిటి ? శ్రావణమాసంలో పవిత్రజలం పేరుతో గంగా నది నుంచి నీరు తెచ్చి తమ ప్రాంతాల్లోని శివాలయాల్లో అభిషేకంచేసి శివుని కృపకు పాత్రులౌతామనే నమ్మకాన్ని వెల్లడిస్తారు. జులై 22 నుంచి ఆగస్టు ఆరవ తేదీ మధ్య హరిద్వార్‌వద్ద ఉన్న గంగానదినుంచి తెచ్చే నీటి పాత్రలను కావళ్లలో పెట్టి తీసుకువస్తారు. కనుక దీనికి కావడి యాత్ర అనే పేరు వచ్చింది. వివిధ రాష్ట్రాల నుంచి వేర్వేరు మార్గాల్లో భక్తులు హరిద్వార్ వస్తారు. ఈ మార్గాల్లో యాత్రీకులకోసం వస్తువుల దుకాణాలు, ఆహార పదార్థాల హోటళ్లు. దాబాలు, బండ్లు ఏర్పాటు చేస్తారు. కాలినడకన, మోటారు వాహనాలు ఇలా ఎవరికి వీలైన పద్ధతుల్లో వారు ఈ యాత్రలో పాల్గొంటారు. 1980వ దశకం వరకు చాలా పరిమితంగా జరిగే ఈ క్రతువును క్రమంగా పెద్ద కార్యక్రమంగా మార్చారు. అయ్యప్ప దీక్షలకు పోటీగా అనేక దీక్షలను తెలుగు రాష్ట్రాల్లో ముందుకు తెచ్చిన సంగతి తెలిసిందే. ఇది కూడా అలాంటిదే.

దుకాణాలు, హోటళ్ల ముందు యజమానుల పేర్లకు బదులు " మానవత్వం" అని ప్రదర్శించాలని ప్రముఖ నటుడు సోనూ సూద్ ఎక్స్‌లో సూచన చేశారు. దీని మీద బాలీవుడ్ హీరోయిన్, బీజేపీ లోక్‌సభ సభ్యురాలు కంగనా రనౌత్ స్పందిస్తూ ఉమ్మిన ఆహారం, ఆ పని చేసేవారిని సమర్ధించటమే ఇదని ధ్వజమెత్తారు. ముస్లింలు తయారుచేసే ఆహారం, విక్రయించే పండ్లు మొదలైన వాటి మీద ఉమ్ముతారని, హలాల్ చేస్తారని, అపవిత్రమైన వాటిని హిందువులు బహిష్కరించాలని, హిందువుల పవిత్ర స్థలాలు, గుడులు, గోపురాలు ఉన్న ప్రాంతాలలో ముస్లింల దుకాణాలను అనుమతించరాదని,

ఇప్పటికే ఉంటే ఎత్తివేయాలని హిందూత్వ సంస్థలు ఎప్పటి నుంచో రెచ్చగొడుతున్న సంగతి తెలిసిందే. సాధారణ పౌరులెవరూ వాటిని పట్టించుకోవటం లేదన్నది కూడా ఎరిగిందే. అయోధ్యలో రామాలయం పేరుతో యోగి సర్కార్ బుల్డోజర్లతో కూలదోయించిన కట్టడాల్లో హిందువులవి కూడా ఉన్నాయి. అందుకే అక్కడ బీజేపీకి వ్యతిరేకంగా ఓటువేయటం, అభ్యర్థి ఓటమి తెలిసిందే. పలస్తీనాలో అరబ్బులపై దాడులు, మారణకాండ, స్వతంత్ర దేశ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న ఇజ్రాయిల్ ఉత్పత్తులను బహిష్కరించాలని ముస్లిం, అరబ్బు దేశాలలో అనేక సంస్థలు గతంలో పిలుపునిచ్చాయి. వాటిని కాపీకొట్టిన కాషాయ దళాలు మనదేశంలో ముస్లింల వ్యాపారాలను దెబ్బతీసేందుకు వినియోగిస్తున్నాయి. అరబ్బు దేశాల చమురును బహిష్కరించమని చెప్పేందుకు వారికి నోరురాదు, ఎందుకంటే వారి యాత్రల వాహనాలు నడవాలంటే అక్కడి నుంచి దిగుమతి చేసుకున్న ఇంధనమే దిక్కు. అక్కడ పవిత్రత గుర్తుకు రాదు.

ఉమ్ముతారని చేస్తున్న ప్రచారం వాస్తవం కాదు. నిజమే అయితే రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న అనేక బిర్యానీ హోటళ్లకు, రంజాన్ మాసం సందర్భంగా హలీం కోసం ఎగబడేవారిలో ఎక్కువ మంది ముస్లిమేతరులే ఎందుకు ఉంటున్నారు. దుకాణాలలో విక్రయించే వస్తువులు నాణ్యమైనవా కాదా, హోటళ్లలో వడ్డించే ఆహార పదార్థాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అన్నది గీటురాయిగా ఉండాలి తప్ప యజమానుల వివరాలు ఎందుకు? ఒకవేళ ముస్లిం మతానికి చెందిన వారు యజమానులుగా ఉంటే వాటిని బహిష్కరించాలని పరోక్షంగా చెప్పటమే ఇది. పేర్ల ప్రదర్శన ఒక్క ముస్లింలనే దెబ్బతీస్తుందా? హిందువులను కూడా నష్టపరుస్తుంది. మన సమాజంలో మత విద్వేషమే కాదు, కుల వివక్ష, విద్వేషం కూడా ఎక్కువే, అందునా దేశ ఉత్తరాది, పశ్చిమ ప్రాంతాలలో మరీ ఎక్కువ. దళితులు వివాహాల సందర్భంగా గుర్రాల మీద, ఇతరత్రా ఊరేగింపులు జరపకూడదని, ఎక్క కూడదని దాడులు చేసిన ఉదంతాలు ఎన్ని లేవు. దుకాణాలపై దళితులు, గిరిజనులు, వెనుకబడిన సామాజిక తరగతులకు చెందిన యజమానుల పేర్లను ప్రదర్శిస్తే ముస్లిం దుకాణాలపై అనుసరించే వైఖరినే మనువాద కులాల వారు పాటిస్తారని వేరే చెప్పనవసరం లేదు. అందుకే అనేక చోట్ల గతంలో ఆర్యవైశ్య బ్రాహ్మణ హోటల్ అని రాసుకొనే వారు. ఇప్పుడు ఇంకా ఎక్కడైనా మారుమూల ప్రాంతాల్లో ఉండి ఉండవచ్చు. వాటి స్థానలో రెడ్డి, చౌదరి హోటల్స్ పేరుతో ఎక్కడ చూసినా మనకు దర్శనమిస్తున్నాయి తప్ప ఇతర కులాలను సూచించే హోటళ్లు ఎక్కడా కనిపించకపోవటానికి సమాజంలో ఇప్పటికీ ఉన్న చిన్నచూపు, వివక్షే కారణం. అదే ముస్లింల విషయానికి వస్తే మతవిద్వేషం. రాఘవేంద్ర, రామా, కృష్ణా, వెంకటేశ్వర విలాస్‌లు తప్ప ఎక్కడైనా అబ్రహాం, ఇబ్రహీం, ఏసుక్రీస్తు, మహమ్మద్ ప్రవక్త విలాస్‌లను చూడగలమా?

వ్యవసాయ పరిశోధన వ్యయం రెట్టింపు చేయాలి

డా.సోమ మర్ల

మన జనాభాలో దాదాపు 58 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది భూమి లేని కూలీలు, కౌలుదారులు,చిన్న రైతులు ఉన్నారు. వ్యవసాయ పరిశోధనల కోసం వెచ్చించే ప్రతి రూపాయి 11.2% ఎరువులు, విద్యుత్ సబ్సిడీలు, ప్రాథమిక పాఠశాల విద్యతో గ్రామీణ పేదరికం తగ్గింపు పరంగా వరుసగా 0.88%, 0.79%, 1.2% అని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.కేంద్ర బడ్జెట్ 2023-24లో వ్యవసాయ పరిశోధనలకు రూ. 6,379 కోట్లు కేటాయింపు అయింది. మన దేశంలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, 71 రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ప్రతి జిల్లాలో 700 కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకేలు వ్యవసాయ ప్రదర్శన కేంద్రాలు) ఉన్నాయి. కేవీకేలు గ్రామస్తులకు కొత్త పంట రకాలు, సాగు పద్ధతులను ప్రదర్శిస్తాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వ రంగ ఐసీఏఆర్ మన వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి సహాయపడే కొత్త పంటలు, పౌల్ట్రీ, చేపల రకాలను విడుదల చేస్తుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఆహార ధాన్యాలు 6 రెట్లు, పాలు 10 రెట్లు, పండు, కూరగాయలు, గుడ్లు 12 రెట్లు పెరిగాయి. ఈ అభివృద్ధి అంతా ఆకలిని తగ్గించి దేశాన్ని ఆహారోత్పత్తిలో స్వయం సమృద్ధిగా మార్చాయి.

గత 30 ఏళ్లలో ప్రభుత్వాలు ఎరువులు, డీజిల్, విద్యుత్, విత్తనాలపై సబ్సిడీలను తగ్గించాయి. ఆహార నిల్వ గిడ్డంగులు, పంటలను ఆరబోసే యార్డులు, గ్రామీణ పాఠశాలలు, ప్రైమరీ డిస్పెన్సరీలు, పారుదల కాలువల మరమ్మతులపై ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించాయి. సరైన లాభదాయక పంటల ధరలు (ఎంఎస్‌పీ) నిరాకరించినందున గ్రామీణ దుస్థితి పెరిగింది. కృషి విజ్ఞాన కేంద్రాలు కొత్త పంట రకాలను ప్రదర్శించి రైతులకు నాణ్యమైన విత్తనాలను సబ్సిడీ ధరలకు పంపిణీ చేస్తాయి. కానీ ఇటీవల ఐసీఏఆర్ తన పరిశోధనా సౌకర్యాలు, కేవీకేలను లీజుకు ఇవ్వడానికి బయ్యర్, అమెజాన్ వంటి విదేశీ బహుళజాతి కంపెనీలతో ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకుంది. ఇది అభ్యంతరకరం, ఎందుకంటే మన చిన్న రైతులకు కొత్త పంటల రకాలను, ప్రభుత్వం నుంచి చౌక విత్తనాలను తిరస్కరిస్తారు, ప్రభుత్వ రంగ పరిశోధనల ఖర్చుతో లాభాలను ప్రైవేట్ కంపెనీలు మాత్రమే పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ దుస్థితిని పరిష్కరించడానికి 2024-25 యూనియన్ బడ్జెట్‌లో వ్యవసాయ పరిశోధనపై ఖర్చు కనీసం రెట్టింపు చేయాలి.

రిటైర్డ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్, ఐసిఏఆర్, న్యూఢిల్లీ

విమర్శకుల నోటికి తాళం!

సత్య

వర్తమాన సమాజం సాంకేతిక పరిజ్ఞాన మీద ఎంతగా ఆధారపడి ఉందో, దానికి చిన్నపాటి అంతరాయం కలిగినా ఎన్ని ఇబ్బందులు, ఎంత నష్టం జరుగుతుందో ఈ నెల 19న తలెత్తిన ఒక చిన్న సాంకేతిక సమస్య లేదా జరిగిన తప్పిదం ప్రపంచానికి స్పష్టమైంది. ఆకస్మికంగా ఐదువేలకుపైగా విమానాల రద్దు ప్రకటన, ఎందుకో, ఎప్పుడు పునరుద్ధరణ అవుతాయో చెప్పే నాధుడు లేడు. ప్రయాణీకుల్లో గందరగోళం. ఆసుపత్రులలో ఆపరేషన్లు నిలిపివేశారు. బ్యాంకు ఖాతాలు పనిచేయలేదు. రైలు టికెట్లు జారీ కాలేదు. వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. ఇదంతా క్రౌడ్ స్ట్రయిక్ అనే సైబర్ భద్రతా సంస్థ వైరస్‌లను కనుగొనేందుకు అందచేసిన ఒక లోపభూయిష్టమైన సాఫ్ట్‌వేర్‌ను మైక్రోసాఫ్ట్ సర్వర్లు, కంప్యూటర్లకు అందచేసిన ఫలితమే. నిత్య జీవితంలో ఎంత ఎక్కువగా ఇంటర్నెట్‌ను, కంప్యూటర్లను వినియోగిస్తారో, ప్రత్యేకించి మైక్రోసాఫ్ట్ విండోస్ పరికరాలను వినియోగిస్తారో అక్కడల్లా ప్రపంచమంతటా కొన్ని గంటల పాటు ఇవే దృశ్యాలు.(ఆపిల్ మాక్ కంప్యూటర్లకు ఎలాంటి అంతరాయం కలగలేదు.) నీలి రంగు తెరతో దర్శనమిచ్చిన కంప్యూటర్లు పదే పదే వాటంతట అవే మూతబడ్డాయి, అదే మాదిరి తెరుచుకున్నాయి, తప్పపనిచేయలేదు. దీన్నే నీలిరంగు తెర మృత్యువు అన్నారు గానీ నిజానికి అది చావు బతుకుల మధ్యకొట్టుకోవటం. ఆపరేటర్లకు ఎందుకలా జరిగిందో అర్ధం కాదు, ఏం చేయాలో అసలే తెలియలేదు. ఎలాగైతేనేం పరిస్థితి చక్కబడింది. ఇప్పుడు తీరికగా జరిగిన నష్టం ఎంత అనే లెక్కల్లో మునిగారు. కొన్ని కంపెనీల గుత్తాధిపత్యం ఉంటే ఇదే జరుగుతుందనే హెచ్చరికలు వెలువడ్డాయి. కొందరు ఇదే మంచి తరుణం మించిపోవును మీ కంప్యూటర్ వ్యవస్థలకు బీమా చేయించండి అంటూ సలహాలిస్తుంటే ఇదొక ఆముదమా అంటూ యజమానులు పెదవి విరుస్తున్నారు. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లను కనిపెట్టినవారే వాటిని



దెబ్బతీసే వైరస్‌లను సృష్టిస్తారు, వాటిని నిరోధించే లేదా సంహరించే భద్రత అంటూ మరొక సాఫ్ట్‌వేర్లను అంటగట్టటం తెలిసిందే. తమ కంప్యూటర్లలో తాము సూచించిన సాఫ్ట్‌వేర్లనే వాడాలనే నిబంధనల గురించి తెలిసిందే.మూడింట రెండు వంతుల క్లౌడ్ సదుపాయాల వ్యవస్థలను మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్ సంస్థలే సమకూర్చుతున్నాయి. ఏదీ ఊరికే రాదు, ప్రతిదీ లాభం కోసమే కదా ! గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా వచ్చిన ప్రతిపాదనలను గతంలో మైక్రోసాఫ్ట్ వమ్ముచేసిందనే విమర్శలు ఉన్నాయి.

ఎనభైమూడు బిలియన్ డాలర్ల విలువగల క్రౌడ్ స్ట్రయిక్ అనే సైబర్ భద్రతా ఉత్పత్తుల సంస్థకు ప్రపంచవ్యాపితంగా ఇరవై వేల మంది ఖాతాదారులున్నారు, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వాటిలో ఉన్నాయి. విండోస్‌కు అందచేసిన తమ ఉత్పత్తి ఫాల్కన్ సెన్సర్ సాఫ్ట్‌వేర్‌లో ఉన్న లోపం కారణంగా మైక్రోసాఫ్ట్ వినియోగదారులందరూ ఇబ్బంది పడినట్లు అది ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఈ అప్రదిష్ట కారణంగా ఈ కంపెనీ వాటాల ధరలు పదకొండుశాతం పడిపోయాయి. సైబర్ దాడి జరిగితే వేరు, తాజా ఉదంతం బాధ్యతా రహితంగా వ్యవహరించినందున జరిగింది. ముందస్తు పరీక్షలు జరపకుండా, సరి చూసుకోకుండా నేరుగా ప్రయోగించిన లోప భూయిష్టమైన సాఫ్ట్‌వేర్ దెబ్బకు చైనా తప్ప ప్రపంచం మొత్తం విలవిల్లాడింది. చైనా దాని నుంచి తప్పించుకున్నట్లు హాంకాంగ్ నుంచి వెలువడే సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ అనే పత్రిక పేర్కొన్నది.రాజధాని బీజింగ్, ఆర్థిక కేంద్రం షాంఘై వంటి చోట్ల ఉన్న విమానాశ్రయాలు సాధారణంగా నడుస్తున్నట్లు తెలిపింది. తరువాత ఇతర దేశాల మీడియా కూడా అవే కథనాలను ఇచ్చాయి. చైనా పౌరులు మైక్రోసాఫ్ట్ గురించి సామాజిక మాధ్యమంలో జోకులే జోకులు పేల్చారు. తమకు ఒక పూట సెలవు ఇచ్చినట్లు కొందరు చెప్పగా మా కంపెనీ వెంటనే మరో కంప్యూటర్‌కు మారినందున మాకు అది కూడా దక్కలేదని ఇంకొందరు చమత్కరించారు. ఇప్పటికీ నల్లమందు భాయిలంటూ నిందించేవారు, చౌకరకం వస్తువులను తయారు చేయటం తప్ప ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వారి దగ్గర లేదంటూ చైనాను వర్ణించేవారికి ఒక్కసారిగా బుర్రలు పనిచేయటం నిలిచిపోయాయి. మైక్రోసాఫ్ట్ దెబ్బకు జరిగిన నష్టం విలువ ఎంతో ఇంకా తేలలేదు, దాని నుంచి బయటపడేందుకు ఎంత సమయం తీసుకుంటుందో తెలియదని చెబుతున్నారు. చైనాలో అసలేమీ ప్రభావితం కాలేదా ? అక్కడ మైక్రోసాఫ్ట్ సేవలు లేవా ? ఉన్నాయి, కొన్ని ప్రభావితమయ్యాయి. మైక్రోసాఫ్ట్‌తో పనిచేసే అక్కడి విదేశీ సంస్థలు తప్ప చైనా సొంత విమానాశ్రయాలు, ఇతర మౌలిక సదుపాయాలు మామూలుగానే పనిచేశాయి. బహుశా ప్రపంచంలో సాంకేతిక అంతరాయం ఇంత పెద్ద ఎత్తున ఏర్పడటం ఇదే ప్రథమం. తిరుగులేని సంస్థగా పేరున్న మైక్రోసాఫ్ట్‌కూ ఇది కోలుకోలేని దెబ్బ. దాని మీద ఆధారపడిన విమానాశ్రయాలు, సంస్థలు, బాంకులు, మీడియా సంస్థల కార్యకలాపాలకూ అంతరాయం కలిగింది. రక్షణ సాఫ్ట్‌వేర్ దెబ్బకు దాన్ని తయారు చేసిన కంపెనీతో పాటు మైక్రోసాఫ్ట్ కూడా పేరుతో పాటు ఆర్థికంగా కూడా నష్టపోయాయి.వాటి ఖాతాదారులకు జరిగిన నష్టం గురించి అంచనాలు వేస్తున్నారు. ఇవి 2400 కోట్ల నుంచి లక్షల కోట్ల డాలర్ల వరకు ఉంటుందని, కొన్ని వారాల వరకు అంతరాయ పర్యవసానాలు ఉంటాయని చెబుతున్నారు. అమెరికాలో ప్రావైడెన్స్ హెల్త్ అనే సంస్థకు ఏడు రాష్ట్రాలలో 52 ఆసుపత్రులున్నాయి.నలభైవేల సర్వర్లకు గాను పదిహేను వేలు, లక్షా 50వేల కంప్యూటర్లు పనిచేయలేదు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.ప్రపంచ వ్యాపితంగా ఉన్న కంప్యూటర్లలో ఒకశాతానికి అటూ ఇటుగా అంటే 85లక్షల విండోస్ కంప్యూటర్లు ప్రభావితమయ్యాయి.2017లో వాన్నాక్రై సైబర్‌దాడిలో 150దేశాల్లో మూడులక్షల కంప్యూటర్లు దెబ్బతిన్నాయి.ఇలాంటి పెద్ద దాడులేగాక చిన్న చిన్నవి నిరంతరం జరుగుతూనే ఉంటాయి.

ఇటు వానలు... అటు కరువు

దేశంలో విచిత్ర వాతావరణం

న్యూఢిల్లీ: దేశంలో ఈ ఏడాది విచిత్ర వాతావరణం కనిపిస్తోంది. జూన్-జులై మధ్యకాలంలో కొన్ని రాష్ట్రాల్లో అతివృష్టి, మరికొన్ని రాష్ట్రాల్లో అనావృష్టి ఏర్పడింది. ఉత్తరాది సహా 9 రాష్ట్రాల్లో లోటు వర్షపాతం నమోదుకాగా, తమిళనాడు సహా ఆరు రాష్ట్రాల్లో కుంభవృష్టిగా వానలు కురుస్తున్నాయి. జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఒడిశా, బీహార్ సహా తొమ్మిది రాష్ట్రాల్లో 20 నుంచి 49 శాతం మేరకు లోటు వర్షపాతం నమోదైంది. జార్ఖండ్‌లో అత్యధికంగా 49 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అదేసమయంలో నాలుగు దక్షిణాది రాష్ట్రాలు సహా మొత్తం ఆరు రాష్ట్రాల్లో అత్యధిక వర్షాలు కురిసినట్టు తెలిపారు. జూన్ 1 నుంచి జులై 20వ తేదీ వరకు అందిన సమాచారం మేరకు తమిళనాడులో సాధారణ వర్షాలకంటే 83 శాతం ఎక్కువగా కురిశాయి. దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో ఒక శాతం మేరకు లోటు వర్షపాతం నమోదైంది. వాయవ్య రాష్ట్రాల్లో 14 శాతం, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో 12 శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు అధికారులు వివరించారు. ప్రాంతాల వారీగా చూస్తే మధ్య భారతంలో లోటు తగ్గింది. దక్షిణాది రాష్ట్రాలలో ఇప్పటి వరకు సాధారణం కన్నా 26 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దక్షిణాదిలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మెరుగుపడవచ్చని తెలిపింది. కాగా, వర్షాభావ పరిస్థితులతో అనేక రాష్ట్రాల్లో కొత్త సాగు ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు.

భారీ వర్షాలతో ప్రాజెక్టులకు జలకళ: డీకే శివకుమార్

బెంగళూరు: దేశవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో అనేక ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. నీటి ఎద్దడితో సతమతమైన కర్నాటకలోనూ ఇటీవలి భారీ వర్షాలతో పరిస్థితి చక్కబడింది. భారీ వర్షాలతో తగినంత నీరు వచ్చిచేరిందని, నీటి ఎద్దడి నివారణ దిశగా ఈ సంతోషకరమైన వార్తను పంచుకుంటున్నానని కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ హర్షం వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని రైతాంగాన్ని కోరుతున్నానని, వరద నీరు అధికంగా పోటెత్తితే అప్రమత్తం కావాలని తాను సూచించానని చెప్పారు. ఈ వారంలో పవిత్రమైన దినాల్లో నదులకు పూజ చేయాలని తాను రైతులను కోరానని తెలిపారు. ఈ విషయంపై తాను సీఎం సిద్ధరామయ్యతో మాట్లాడానని, గంగా పూజ నిర్వహించే వారణాసికి తాను ఓ బృందాన్ని పంపించానని వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి అదే తరహా పూజను కర్నాటకలో నిర్వహిస్తామని అన్నారు. కరువులు, వరదలు నివారించి ఏటా మన డ్యామ్‌లు నీటితో నిండాలని కోరుతూ ఈ తరహా పూజలు క్రమం తప్పకుండా తాము నిర్వహించేందుకు కసరత్తు సాగిస్తున్నామని డీకే శివకుమార్ తెలిపారు.

తడిసి ముద్దయిన ముంబై

హై టైడ్ అలర్ట్ ప్రకటించిన అధికారులు

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. కొన్ని రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో నగరం మొత్తం తడిసి ముద్దవుతోంది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకూ కేవలం 24 గంటల వ్యవధిలో ముంబైలోని చాలా ప్రాంతాల్లో 200 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఆటోమేటిక్ వాతావరణ కేంద్రం తెలిపింది. ట్రాంబేలో 241 మి.మీటర్ల గరిష్ఠ వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. ఆ తర్వాత వడాలాలో 223 మి.మీ, ఘట్‌కోపర్‌లో 215 మి.మీ, వర్లీలో 204 మి.మీ, సెవ్రిలో 203 మి.మీ, బీకేసీలో 199 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముంబైలో అధికారులు హై టైడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ కుండపోత వర్షాలకు మహా నగరంలో జనజీవనం స్తంభించిపోయింది. అనేక ప్రాంతాలు నీట మునిగాయి. సోమవారం కూడా నగరంలో భారీ వర్షాలు కురిసినట్లు భారత వాతావరణ విభాగం తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని నవీ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ విపత్తు నిర్వహణ విభాగం సూచించింది. ఇక భారీ వర్షాల కారణంగా నగరంలోని చాలా ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఏర్పడింది. చాలాచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైళ్లు, విమాన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

స్థానిక ఎన్నికల్లో ఒంటరి పోరు: అజిత్ పవార్

ముంబై: స్థానిక, పౌర సంస్థల ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేస్తామని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) జాతీయ అధ్యక్షుడు అజిత్ పవార్ కీలక ప్రకటన చేశారు. పింప్రి చించ్‌వాడ్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఈ మేరకు ఆయన వెల్లడించారు. 'లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి మిత్రపక్షాలతో కలిసి ఎన్సీపీ పోరాడింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ మిత్రపక్షాలతో కలిసి పార్టీ పోరాడుతుంది. అయితే పౌర, స్థానిక సంస్థల ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేస్తాం' అని అన్నారు. ఎన్సీపీ గెలుపు కోసం రానున్న అసెంబ్లీ ఎన్నికలే కాకుండా స్థానిక, పౌర సంస్థల ఎన్నికలకు కూడా సన్నద్ధం కావాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాగా, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ నేతలు క్రమంగా శరద్ పవార్ వర్గం వైపు మళ్లుతున్నారు. కొన్ని రోజుల కిందట పింప్రి చించ్‌వాడ్‌కు చెందిన 28 మంది ఎన్సీపీ నేతలు శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరారు. మరి కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా అదే యోచనలో ఉన్నారు. ఈ తరుణంలో స్థానిక, పౌర సంస్థల ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయాలని అజిత్ పవార్ నిర్ణయించారు. మరోవైపు మహారాష్ట్రలో 27 మున్సిపల్ కార్పొరేషన్లు, 25 జిల్లా పరిషత్‌లు, రెండు మున్సిపాలిటీలకు సుమారు రెండేళ్లుగా ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఎన్సీపీకి పూణే, పింప్రి చించ్‌వాడ్‌లోనే బలం ఉంది. ముంబై, ఇతర నగరాల్లో ఆ పార్టీకి కనీస ఉనికి లేదు.

ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రలో అగ్నిప్రమాదం... నావికుడి గల్లంతు

ముంబై: ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రలో అగ్ని ప్రమాదం జరిగింది. ముంబైలోని డాక్‌యార్డులో ఉన్న ఈ యుద్ధనౌక తీవ్రంగా దెబ్బతిన్నట్లు నౌకాదళం వెల్లడించింది. ఈ ఘటనలో ఓ జూనియర్ నావికుడు గల్లంతు కాగా... అతడి కోసం రెస్క్యూ బృందాలు గాలింపు చేపట్టాయి. మిగతా సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు సమాచారం.. మరమ్మతుల కోసం డాక్‌యార్డులో నిలిపిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. నౌకాదళ డాక్‌యార్డులో ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రకు మరమ్మతులు నిర్వహిస్తున్న క్రమంలో ఆదివారం సాయంత్రం మంటలు చెలరేగాయి. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక బృందాలు మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ప్రమాద ఘటనకు సంబంధించి పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతోంది అని నౌకాదళం పేర్కొంది. సోమవారం మధ్యాహ్నానికి నౌక ఓ పక్కకు ఒరిగిపోయిందని, దాన్ని పూర్వస్థితికి తెచ్చేందుకు అన్నివిధాలా కృషి చేసినప్పటికీ అది సాధ్యం కాలేదని తెలిపింది. ఒక జూనియర్ నావికుడు మినహా మిగతా సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని.. గల్లంతైన నావికుడి కోసం గాలింపు కొనసాగుతోందని పేర్కొంది.

అరెస్టైన నేతల వర్చువల్ ప్రచారానికి సుప్రీం 'నో'

న్యూఢిల్లీ: అరెస్ట్ అయిన నేతలు ఎన్నికల సమయంలో వర్చువల్ విధానం ద్వారా ప్రచారంలో పాల్గొనేలా అనుమతించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. దురుద్దేశంతో ఈ పిటిషన్ దాఖలు చేశారంటూ సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అరెస్టయిన నేతలకు ఎన్నికల సమయంలో ప్రచారం చేసుకొనేందుకు అనుమతించాలంటూ గతంలో వేసిన ఓ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు ఇటీవల తప్పుబట్టింది. దీనిపై సానుకూల తీర్పు వెలువరిస్తే... పరారీలో ఉన్న నేరస్థులు, గ్యాంగ్‌స్టర్లు రాజకీయ పార్టీలో ప్రాబల్యం పెంచుకునే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇది ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ ఆ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ.. అమర్‌జీత్ గుప్తా అనే న్యాయ విద్యార్థి సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. దురుద్దేశంతోనే ఈ పిటిషన్‌ను దాఖలు చేశారంటూ పిటిషనర్‌పై మండిపడింది. ఇది ఒక రాజకీయ నేత (అరవింద్ కేజ్రీవాల్)ను కేంద్రంగా చేసుకొని ఉన్నట్లు ధర్మాసనం అభిప్రాయపడింది. దీనిపై సానుకూలంగా స్పందించలేమని పేర్కొంటూ ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. హైకోర్టు ఆదేశాలను సమర్థించిన సుప్రీం ధర్మాసనం... అందులో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది.

ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగులు

మండిపడిన కాంగ్రెస్



న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడంపై దశాబ్దాలుగా ఉన్న నిషేధాన్ని మోదీ ప్రభుత్వం ఎత్తివేసింది. గత వారమే ఇచ్చిన ఉత్తర్వుల కాపీని బీజేపీ నేత అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. దీనిపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. దీనిపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ సుదీర్ఘ పోస్టు పెట్టారు. 58 ఏళ్ల క్రితం జారీ చేసిన రాజ్యాంగ విరుద్ధమైన ఆదేశాలను మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకుందని మాలవీయ వెల్లడించారు. దీనిపై జైరాం రమేశ్ స్పందిస్తూ..'మహాత్ముడి హత్య తర్వాత 1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించారు. మంచి ప్రవర్తన హామీతో ఆ నిషేధాన్ని తొలగించారు. కానీ 1966లో మళ్లీ ఆ నిషేధం అమల్లోకి వచ్చింది. తాజా చర్య అనేక అనుమానాలకు తావిస్తోంది' అని విమర్శించారు. ఇటీవల ఆర్ఎస్ఎస్-బీజేపీ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ నిషేధాన్ని ఎత్తివేయడాన్ని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఆశించిన స్థాయి విజయం సాధించలేక... 240 సీట్లకే పరిమితమైంది. ఆ ఫలితాల అనంతరం ఆర్ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్‌లో ఒక వ్యాసం ప్రచురితమైంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీజేపీ కార్యకర్తల అతి విశ్వాసాన్ని కళ్లకు కట్టాయని, వారితోపాటు నేతలంతా 'గాలి బుడగ'ను నమ్ముకొని పని చేశారని, మోదీపైనే ఆధారపడ్డారని, వీధుల్లో ప్రజల గొంతుకలు వినలేదని ఆ వ్యాసం పేర్కొంది. నిజమైన సేవకుడికి అహంకారం ఉండదని, ఇతరులకు ఎలాంటి హాని కలిగించకుండా పని చేస్తాడని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దాంతో బీజేపీపై ఆర్ఎస్ఎస్ గుర్రుగా ఉందని వార్తలు వచ్చాయి. ఈ అంశాన్ని జైరాం రమేశ్ ప్రస్తావించారు.

సుప్రీంకోర్టు 'స్టే'పై జేడీయూ హర్షం

న్యూఢిల్లీ: కన్వర్ (కావడి) యాత్ర మార్గంలోని హోటళ్లు, తోపుడుబండ్ల ముందు వాటి యజమానులు, సిబ్బంది పేర్లు పెట్టాలంటూ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం 'మధ్యంతర స్టే' ఇచ్చింది. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయంపై విపక్షాలు హర్షం వ్యక్తం చేయగా, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కీలక భాగస్వామి జనతాదళ్ యునైటెడ్ తీర్పును స్వాగతించింది. యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వ ఆదేశాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, తినుబండారాల విక్రేతలు తమ దుకాణాల వద్ద యజమానులు, ఉద్యోగుల పేర్లు ప్రదర్శించాలంటూ బలవంతం చేయరాదని న్యాయమూర్తులు జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని ఆయా ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను జేడీయూ ప్రతినిధి కేసీ త్యాగి స్వాగతించారు. సమాజాన్ని విడగొట్టేలా ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయనే ఆందోళనలు తమకు ఉన్నాయన్నారు. ఈ విజయాన్ని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

సీఎంలకు మోదీ రాజధర్మం చెబుతారా? కాంగ్రెస్

సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నట్టు కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా చెప్పారు. యోగి సర్కార్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగ వ్యతిరేకమని కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలు చెప్పాయని, ప్రధాని ఇప్పటికైనా తమ ముఖ్యమంత్రులకు 'రాజధర్మం' గురించి వివరించి, ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా చూస్తారని ఆశిస్తున్నామని అన్నారు. శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును తమ పార్టీ స్వాగతిస్తోందని, అధికార బీజేపీ ఈ తరహా దిగజారుడు రాజకీయాలు జరుపుతోందని ధ్వజమెత్తారు.

ప్రతిపక్షాలది ప్రతికూల రాజకీయం: మోదీ



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి గొంతు నొక్కేందుకు ప్రతిపక్షాలు అప్రజాస్వామిక ప్రయత్నం చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఆరోపించారు. పార్లమెంటు 'దళ్' కోసం కాదని, 'దేశం' కోసమని అన్నారు. కొన్ని పార్టీలు తమ రాజకీయ వైఫల్యాలను దాచడానికి 'ప్రతికూల రాజకీయాలు', పార్లమెంటును 'దుర్వినియోగం' చేశాయని చెప్పారు. పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ముందు మీడియాతో మాట్లాడిన మోదీ... మంగళవారం సమర్పించనున్న కేంద్ర బడ్జెట్ రాబోయే ఐదేళ్ల ప్రయాణానికి దిశానిర్దేశం చేస్తుందని, 2047లో 'వికసిత్ భారత్' కల సాకారానికి పునాది వేస్తుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, రాబోయే ఐదేళ్లపాటు దేశం కోసం అన్ని రాజకీయ పార్టీలు కలిసి పోరాడాలని మోదీ అన్నారు. 'నేను ఎంపీలందరికీ చెప్పాలనుకుంటున్నాను, వారు ఏ పార్టీకి చెందిన వారైనా కావచ్చు. జనవరి నుంచి ఎన్నికల యుద్ధంలో పోరాడాం. ఏమి చెప్పాలనుకున్నామో ప్రజలకు చెప్పాం. కొందరు దారి చూపించారు. మరికొందరు తప్పుదారి పట్టించారు. కానీ ఆ కాలం ముగిసింది. ఇప్పుడు ప్రజలు తీర్పు చెప్పారు. ఇప్పుడు వచ్చే ఐదేళ్ల పాటు మనం దేశం కోసం పోరాడాలి' అని తెలిపారు. రాజకీయ పార్టీలు రాబోయే నాలుగు నుంచి నాలుగున్నరేళ్ల పాటు పార్లమెంటు వేదికను ఉపయోగించుకోవాలని ప్రధాని కోరారు. 'జనవరి 2029, ఇది ఎన్నికల సంవత్సరం అయినప్పుడు మీరు ఎన్నికల రంగంలోకి వెళ్లవచ్చు. దాని కోసం పార్లమెంటును కూడా ఉపయోగించుకోండి. పేదల సాధికారత కోసం పని చేయండి. 2047 కలను నెరవేర్చుకునేందుకు రైతులు, యువత, మహిళలు, ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాన్ని నిర్మించండి' అని మోదీ కోరారు. '2014 తర్వాత కొంతమంది ఎంపీలు ఐదేళ్లు, మరికొందరు పదేళ్లు ఎన్నికయ్యారు. కానీ చాలా మంది ఎంపీలు తమ నియోజకవర్గం గురించి మాట్లాడే అవకాశం లేకపోగా, ప్రతికూల రాజకీయాల వల్ల పార్లమెంటులో తమ అభిప్రాయాలను పంచుకోలేకపోయారని బాధతో చెబుతున్నాను. కొన్ని పార్టీలు తమ రాజకీయ వైఫల్యాలను దాచుకునేందుకు పార్లమెంటును దుర్వినియోగం చేశాయి' అని అన్నారు. తొలిసారిగా ఎంపీలుగా ఎన్నికయిన వారికి పార్లమెంటులో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని మోదీ అన్ని పార్టీలను కోరారు. 'ఈ లోక్‌సభ మొదటి సమావేశంలో మీరు దాన్ని చూసి ఉంటారు. 140 కోట్ల మంది భారతీయులకు సేవ చేయాలని ఆదేశించిన ప్రభుత్వ గొంతును నొక్కేసే అప్రజాస్వామిక ప్రయత్నం జరిగింది. రెండున్నర గంటల పాటు ప్రధాని గొంతును నొక్కే ప్రయత్నాలు జరిగాయి. ప్రజాస్వామ్య సంప్రదాయాల్లో అలాంటి వాటికి తావులేదు. దానిపై వారికి ఎలాంటి పశ్చాత్తాపం లేదు' అని మోదీ అన్నారు. 'ప్రజలు మనల్ని ఇక్కడికి పంపింది పార్టీ కోసం కాదు. దేశం కోసం. ఈ పార్లమెంటు 'దళ్ (పార్టీ)' కోసం కాదు, 'దేశ్ (దేశం)' కోసం. ఈ పార్లమెంటు ఎంపీలకే పరిమితం కాదు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజల కోసం' అని ఆయన నొక్కి చెప్పారు. ఎంపీలందరూ చర్చకు సహకరిస్తారని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యతిరేక అభిప్రాయాలు తప్పేమీ కాదని, ప్రతికూల అభిప్రాయాలే తప్పని అన్నారు. దేశానికి ప్రతికూలత అవసరం లేదని తెలిపారు. అభివృద్ధి, ప్రగతి అనే సిద్ధాంతంతో దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని మోదీ అన్నారు. మన ప్రజాస్వామ్యం గర్వించదగిన ప్రయాణంలో వర్షాకాల సమావేశాలు ఒక ముఖ్యమైన గమ్యస్థానమని కూడా చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని ప్రధాని తెలిపారు. 'దేశ ప్రజలకు నేను ఇస్తున్న హామీలను క్రమంగా సాకారం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఈ బడ్జెట్ అమృత్‌కాల్‌కు కీలకమైన బడ్జెట్. మాకు ఐదేళ్ల అవకాశం లభించింది. ఈ బడ్జెట్ దిశానిర్దేశం చేస్తుంది. ఆ ఐదేళ్లపాటు మా కృషితో పాటు 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలను జరుపుకునే 2047లో 'వికసిత్ భారత్' అనే మా కలను నెరవేర్చుకోవడానికి బలమైన పునాది వేసింది' అని ఆయన అన్నారు.

వ్యవసాయంపై దేశవ్యాప్త చర్చ అవసరం

సీఈఏ అనంత నాగేశ్వరన్



న్యూఢిల్లీ: దేశంలో ద్రవ్యోల్బణం నియంత్రణలోనే ఉందని, 4 శాతానికి దిగువన కొనసాగుతోందని ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ చెప్పారు. ఏడు శాతం వృద్ధిరేటు సాధ్యమే అయినప్పటికీ రుతుపవనాల పురోగతిపై ఇది ఆధారపడి ఉంటుందన్నారు. వృద్ధిరేటు అంచనా వేయడంలో వివేకంతో వ్యవహరించాలని కోరుకుంటున్నామని, అందుకే ఈ ఏడాది వృద్ధి రేటును 6.5 నుంచి 7 శాతంగా అంచనా వేశామని తెలిపారు. ఆర్థిక సర్వే 2023-24 ముందుమాటలో అనేక అంశాలు ప్రస్తావించిన ఆయన... వ్యవసాయ రంగంలో విధానాలపై దేశవ్యాప్త చర్చ జరగాలన్నారు. వ్యవసాయ రంగంలో సంస్కరణలపై దేశవ్యాప్త చర్చ జరగాలని అనంత నాగేశ్వరన్ పిలుపునిచ్చారు. ఇప్పటికే సబ్సిడీలు, మద్దతు చర్యలు ఉన్నప్పటికీ వీటి పునఃపరిశీలనకు విధానపర చర్యలు అవసరమన్నారు. ఆదాయ పన్ను మినహాయింపుతోపాటు నీరు, విద్యుత్తు, ఎరువులకు సబ్సిడీ, కనీస మద్దతు ధర ద్వారా రైతులకు ప్రభుత్వ సహాయం అందుతున్నప్పటికీ విధానాల అమలును మరింత మెరుగుపరచుకునే అవకాశం ఉందన్నారు.

లఖింపూర్ ఖేరి కేసులో ఆశీష్ మిశ్రాకు సుప్రీం బెయిల్

న్యూఢిల్లీ: లఖింపూర్ ఖేరి కేసులో కేంద్ర మాజీమంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశీష్ మిశ్రాకు సోమవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే ఆశిష్ మిశ్రా ఢిల్లీ లేదా లక్నోలోనే ఉండాలంటూ కోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈ కేసులోనే గతేడాది జనవరి 25వ తేదీన ఆశీష్‌కు సుప్రీం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. విచారణ చేపడుతున్న ట్రయల్ కోర్టు వాదనలను వేగవంతంగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో 117 మంది సాక్షుల్లో కేవలం ఏడుగురిని మాత్రమే ఇప్పటివరకు విచారించారని, త్వరగా విచారణ చేపట్టాలని కోర్టు తెలిపింది. కాగా, 2021లో లఖింపూర్‌లో యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య పర్యటనకు వ్యతిరేకంగా రైతులు ఆందోళన చేపట్టారు. ఆ సమయంలోనే ఆశీష్ మిశ్రా వాహనం రైతుల మీదకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు.

ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

న్యూఢిల్లీ: సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు విచారణ సుప్రీంకోర్టులో మరోసారి వాయిదా పడింది. జస్టిస్ బీఆర్ గవాయ్, కేవీ విశ్వనాథ్‌తో కూడిన ధర్మాసనం రెండు వారాలకు విచారణను వాయిదా వేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటుకు నోటు కేసులో నిందితులైన రేవంత్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న నేపథ్యంలో కేసు విచారణను హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు మార్చాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై సుప్రీం నుంచి నోటీసులు అందుకున్న తెలంగాణ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి... తాజాగా కౌంటర్ దాఖలు చేశారు. ఈ కౌంటర్‌ను పరిశీలించిన ధర్మాసనం రిజాయిండర్ దాఖలు చేసేందుకు పిటిషనర్‌కు రెండు వారాల సమయం ఇచ్చింది.

ఆటో డ్రైవర్ అవతారంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

బెంగళూరు: నేటి సమాజంలో అందరివీ ఉరుకులు పరుగుల జీవితాలే. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి కూడా సమయం ఉండట్లేదు. దాంతో ఒంటరితనం జటిల సమస్యగా మారిపోయింది. అయితే ఒంటరితనాన్ని ఎదుర్కొనేందుకు ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చేస్తున్న పని ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఓ స్థానికుడు... తాను కోరమంగళలో ఆటో బుక్ చేసుకున్నప్పుడు ఓ డ్రైవర్ తనను పికప్ చేసుకున్నాడని తెలిపారు. అతడు మైక్రోసాఫ్ట్ లోగో ఉన్న హూడీని ధరించి ఉండటంతో ఆశ్చర్యపోయానన్నారు. అతడితో మాటలు కలపగా... తాను మైక్రోసాఫ్ట్ ఇంజినీర్‌నని, ఒంటరితనాన్ని భరించలేక, ఆ ఒత్తిడిని ఎదుర్కోవడానికి ఇలా వారాంతాల్లో ఆటో నడుపుతున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. దీనిద్వారా ఇతరులతో మాట్లాడుతూ, ఒంటరితనాన్ని అధిగమించడానికి ప్రయత్నిస్తున్నట్లుగా అతడు చెప్పారన్నారు. బెంగళూరులో ఇటువంటి పరిస్థితులు తరచూ కనిపిస్తున్నాయని, స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉండే ఉద్యోగులు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నెటిజన్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పోస్ట్ వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఓ నెటిజన్ స్పందిస్తూ... 'ఇది నిజమేనా...మైక్రోసాఫ్ట్ ఇంజినీర్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారా' అంటూ ప్రశ్నించారు. మరొకరు స్పందిస్తూ... 'బ్రో నారాయణమూర్తి సలహాను పాటిస్తున్నట్లు ఉన్నారు' అంటూ చమత్కరించారు. 'సైడ్ బిజినెస్‌గా ఆటో నడుపుకున్నా మంచి లాభాలే వస్తాయి' అంటూ మరొకరు వ్యాఖ్యానించారు. గతంలో ఓ మహిళ తాను బుక్ చేసిన రాపిడో డ్రైవర్ ఓ ప్రముఖ సంస్థలో కార్పొరేట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడని తెలుసుకొని ఆశ్చర్యపోయానని చేసిన పోస్ట్ అప్పట్లో వైరల్‌గా మారింది.

ఐటీ పరిశ్రమలే కోరుతున్నాయ్

రోజుకు 14 గంటల పనిపై కర్నాటక మంత్రి వివరణ

బెంగళూరు: ఐటీ రంగంలో పనిచేసే ఉద్యోగుల పని గంటలు పెంచాలనే ప్రతిపాదన కర్నాటకలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. దీనిపై రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సంతోశ్ లాడ్ సోమవారం స్పందించారు. పని గంటలు పెంచాలంటూ ఐటీ పరిశ్రమలే ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయని వెల్లడించారు. 'ఉద్యోగుల పని వేళలు పెంచాలని నిర్ణయించింది ఐటీ మంత్రి ప్రియాంక్ ఖర్గే కాదు. సమయం పెంచాలంటూ స్వయంగా ఐటీ పరిశ్రమలే ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. దీని కారణంగానే ఈ బిల్లు తీర్మానానికి వచ్చింది. ప్రస్తుతం ఈ అంశంపై చర్చలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంపై ఉద్యోగుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పారిశ్రామికవేత్తలు బహిరంగ చర్చ జరపాల్సిన అవసరముంది. ప్రజలు కూడా దీనిపై అభిప్రాయాన్ని పంచుకోవాలని కోరుతున్నా. అప్పుడే ఈ సమస్యకు సరైన పరిష్కారం దొరుకుతుంది' అని విలేకరుల సమావేశంలో మంత్రి తెలిపారు. ఈ అంశంపై ప్రధాన భాగస్వామ్య పక్షాలతో పాటు ప్రతి ఒక్కరూ అభిప్రాయాలు పంచుకోవాలని సంతోశ్ లాడ్ విజ్ఞప్తి చేశారు. కాగా.. ఐటీ/ఐటీఈఎస్/ బీపీఓ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు రోజులో 12 గంటలకు మించి పని చేసేందుకు కొత్త బిల్లు అనుమతిస్తుంది. రోజులో గరిష్ఠంగా 14 గంటల చొప్పున పని చేయడానికి వీలు కల్పించేలా ప్రతిపాదిస్తుంది. ప్రస్తుతం ఓవర్‌టైమ్‌తో కలిపి గరిష్ఠంగా 10 గంటలు మాత్రమే పని చేయించేందుకు అనుమతి ఉంది. కర్నాటక ప్రభుత్వం చేస్తోన్న కొత్త ప్రతిపాదనపై కార్మిక సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఇయర్‌ఫోన్ తెచ్చిన తంటా...

ఇద్దరు బాలుర మృతి



ఘాజీపూర్: రైల్వే ట్రాక్‌పై కూర్చొని పాటలు వింటుండగా రైలు దూసుకురావడంతో ఇద్దరు బాలురు మృతిచెందారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజ్‌దేపూర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు సమీర్ (15), జాకీర్ అహ్మద్ (16) ఆదివారం సాయంత్రం ఇయర్‌ఫోన్‌లు పెట్టుకుని... రైల్వే ట్రాక్ మీద కూర్చొని పాటలు వింటున్నారు. అదే సమయంలో పట్టాలపై దూసుకొచ్చిన రైలు ఢీకొట్టడంతో వారిద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పట్టాలపై మృతదేహాలను గుర్తించిన సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇద్దరూ చెవుల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకోవడం వల్ల వారికి రైలు శబ్దం వినిపించకపోయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తదుపరి విచారణ కొనసాగుతోందని తెలిపారు.

సంకీర్ణ ధర్మానికి మోదీ తూట్లు

అఖిలపక్షాన్ని చంద్రబాబు ఢిల్లీ తీసుకెళ్లాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు

విశాలాంధ్ర-తిరుపతి: నరేంద్ర మోదీ పాలన సంకీర్ణ ధర్మానికి భిన్నంగా కొనసాగుతోందని, ఇది అత్యంత ప్రమాదకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు విమర్శించారు. తిరుపతి సీపీఐ జిల్లా సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది.సమావేశానికి ముఖ్య అతిథులుగా జి.ఓబులేసుతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు హాజరయ్యారు. ఓబులేసు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రధాని మోదీ దేశ ప్రజల తిరస్కారానికి గురయ్యారని విమర్శించారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితికి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ప్రతిపక్ష నేతలను జైలుకు పంపడం ద్వారా ప్రజాస్వామ్యానికి మోదీ పాతరేస్తున్నారని, ప్రజల్ని భయకంపితులను చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అహంకార పాలన సాగించిన వైఎస్ జగన్‌కు ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చినా మోదీను ప్రశ్నించలేని పరిస్థితిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారని చెప్పారు. ప్రత్యేక తరగతి హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ సాధన కోసం అఖిలపక్షాన్ని చంద్రబాబు ఢిల్లీకి తీసుకుపోవాలని డిమాండ్ చేశారు. మోదీ సర్కారు చంద్రబాబు, నితీశ్‌కుమార్ దయాదాక్షిణ్యాలపై నడుస్తోందన్నారు. అయినా మోదీ తన పాత పద్ధతులు మానుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్‌డీయే ప్రభుత్వం కూడా జగన్ తరహా అరాచక పాలన చేయడం మంచిది కాదని హితవు పలికారు. చంద్రబాబు విద్యుత్ చార్జీలపై విడుదల చేసిన శ్వేతపత్రంలో ట్రూ అప్ చార్జీలు తగ్గిస్తామని చెప్పకపోవడం మోసపూరితమన్నారు. అధికార పార్టీ మన పార్టీ బలం, బలగాన్ని గుర్తించాలని సూచించారు. సంఘాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ శతవార్షికోత్సవాలను ఘనంగా జరుపుకోవాలన్నారు.

హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరైతే ప్రజల్ని, కార్మికులను కట్టుబానిసలుగా చేస్తున్నారో... అలాంటి ప్రజా వ్యతిరేకులను ఓడించాలన్నారు. కేంద్రంలో మోదీ ఓడి గెలిచారని, గతంలో 303 సీట్లు ఇస్తే మతకలహాలు సృష్టిస్తూ ముస్లింలు, క్రైస్తవులు దేశం వదిలి వెళ్లిపోవాలని, జర్నలిస్టులు, కవులు, రచయితలు, కళాకారులును హతమార్చడం వంటి అరాచక చర్యలకు పాల్పడ్డారని, దీంతో ఈసారి 240 సీట్లకే ప్రజలు పరిమితి చేశారని వివరించారు. ప్రజల్లో చైతన్యం కారణంగానే బీజేపీకి మెజారిటీ తగ్గిందన్నారు. అహంభావం వల్లే జగన్ దారుణ ఓటమి మూటగట్టుకున్నారని, నాయకుడు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. అహంకారంతో విర్రవీగితే ఫలితాలు తారుమారవుతాయన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబును కూడా నమ్మడానికి వీలు లేదన్నారు. గతంలో విద్యుత్ చార్జీలు తగ్గించమని పోరాటం చేస్తే ప్రజల్ని కాల్చి చంపారని గుర్తుచేశారు. పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై దాడి చేయడం ముమ్మాటికీ తప్పేనన్నారు. మనం మన పార్టీ గురించి ఆలోచించకుండా ఇతరులను గెలిపించాలని చూస్తున్నామని, ఇది ఎంతమాత్రం మంచిది కాదని చెప్పారు. ఎన్నికల్లో గెలవాలన్న తపన అందరికీ రావాలన్నారు. మనం రాజకీయ, సామాజిక స్పృహ కోల్పోతున్నామని, ఇక నుంచి మనమంతా కసితో పని చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్ స్వాగతం పలికారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.శివారెడ్డి, జిల్లా నాయకులు పార్థసారథి, సీహెచ్ ప్రభాకర్, చిన్నం పెంచలయ్య, జె.రామచంద్రయ్య, కె.రాధాకృష్ణ, చిన్నిరాజ్, బి.నదియా, జె.గురవయ్య, జి.శశికుమార్, సుధాకర్‌రెడ్డి, కత్తి రవి, బండి చలపతి, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టండి

సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: పెద్ద వాగు ముంపు ప్రాంతాలు, గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి, ప్రజలను ఆదుకోవాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. పెద్ద వాగు ముంపు ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఆదివారం తనతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, డేగా ప్రభాకర్, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య తదితరులతో కూడిన సీపీఐ ప్రతినిధి బృందం పర్యటించి, స్థానిక ప్రజల బాధలను పరిశీలించిందని తెలిపారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల గోదావరి నదిపై తెలంగాణా రాష్ట్రం, అశ్వారావుపేట మండలం, గుమ్మడవల్లి వద్ద నిర్మించిన పెద్ద వాగు ప్రాజెక్టుకు గండిపడిందన్నారు. పెద్ద వాగు ప్రాజెక్టు తెలంగాణ ప్రాంతంలో ఉండగా, ఆయకట్టు ప్రాంతమంతా ఆంధ్ర ప్రాంతంలోనే ఉందని తెలిపారు. ప్రాజెక్టు తెగిపోవడం వల్ల ఆంధ్రాలో ఉన్న ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతానికి పెను నష్టం వాటిల్లిందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని దాదాపు 15 గ్రామాలు అల్లకల్లోలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ముంపు ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో చాలా నష్టం జరిగి, వేలాది కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారని చెప్పారు. వేలాది ఎకరాల్లో ఇసుక మేటలేసి పంట నష్టం జరిగిందన్నారు. ఏపీ మంత్రి పార్థసారథి, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం బాధితులకు ఆహార, వసతి సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ప్రాజెక్టులకు మరమ్మతులు చేయకపోవడం వల్ల కొట్టుకుపోతున్నాయని తెలిపారు. గతంలో భారీ వర్షాలు, వరదలకు అన్నమయ్య, పింఛ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయని గుర్తు చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో ముఖ్యంగా పోలవరం నిర్వాసితులు ఉండే ప్రాంతంలో అధిక వర్షాలు, వరదల కారణంగా ప్రతి ఏటా అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని వివరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. జాతీయ ప్రాజెక్టును పూర్తి చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని విమర్శించారు. పోలవరం నిర్మాణం వల్ల భూములు కోల్పోతున్న వారు, గ్రామాలకు గ్రామాలు ఖాళీ చేయాల్సిన పోలవరం నిర్వాసితులు వర్షాలు వచ్చిన సందర్భంలో అనేక సార్లు నష్టపోతున్నారని, పునరావాసం కోసం పరుగులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, గిరిజనులు ఎక్కువగా ఉన్న పోలవరం ముంపు ప్రాంతాలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పెద్ద వాగు ముంపు బాధిత 15 గ్రామాల ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెద్ద వాగు ముంపునకు తోడు భారీ వర్షాల వల్ల గోదావరి నదికి వరద పోటెత్తుతోందని తెలిపారు. గోదావరి వరద భయంతో స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా గ్రామాలకు గ్రామాలకు ఖాళీ చేసి ట్రాక్టర్లు, ఆటోలలో మెరక ప్రాంతాలకు తరలిపోతున్నారని పేర్కొన్నారు. గోదావరి ముంపు ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారం, పునరావాసం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెద్ద వాగు ముంపు ప్రాంతాలు, గోదావరి వరద బాధిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. పంట నష్టపోయిన రైతాంగానికి, ఇళ్లు కోల్పోయి నిర్వాసితులైన బాధితులకు పరిహారం అందించి ఆదుకునేందుకు తగు చర్యలు చేపట్టవలసిందిగా రామకృష్ణ కోరారు.

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ తుది షెడ్యూలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్ (2024) ఇంజినీరింగ్ తుది విడత వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూలును కన్వీనర్ సోమవారం విడుదల చేశారు. ఎంపీసీ స్ట్రీమ్‌లో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మంగళవారం నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు, ఫీజు రిజిస్ట్రేషన్ల చెల్లింపు ప్రక్రియ కొనసాగుతుంది. 23 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో ధృవీకరణ పత్రాలను పరిశీలిస్తారు. 24 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. 27న నమోదు చేసుకున్న వెబ్ ఆప్షన్లలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తారు. 30వ తేదీ సాయంత్రం ఆరు గంటల తర్వాత సీట్లను వెల్లడిస్తారు. సీట్లు పొందిన అభ్యర్థులంతా ఆయా కళాశాలల్లో ఈనెల 31వ తేదీ నుంచి ఆగస్టు మూడో తేదీ మధ్య రిపోర్ట్ చేసుకోవాలి. ఇప్పటికే మొదటి దశ కౌన్సెలింగ్‌లో భాగస్వామ్యం కాని అభ్యర్థులు...ఈ తుది విడత కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోవచ్చు. వారితోపాటు మొదటి దశలో సీట్లు పొంది, ఆయా ఇంజినీరింగ్ కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసిన వారంతా, అంతకంటే మెరుగైన స్థానం కోసం రెండోవిడత కౌన్సెలింగ్‌లో భాగస్వామ్యం కావచ్చు. పూర్తి వివరాలను ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

హామీల అమలు కోసం పోరాడాలి

అన్నమయ్య జిల్లాలో సీపీఐ పటిష్టతకు కృషి చేయాలి

గుజ్జుల ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్

రాయచోటి-విశాలాంధ్ర: కేంద్రంలోని బుల్డోజర్ సర్కార్, రాష్ట్రంలో ఏర్పడిన డబుల్ ఇంజన్ సర్కార్ ఇచ్చిన హామీల అమలు సాధన కోసం సీపీఐ శ్రేణులు ప్రజలతో మమేకమై పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఇక్కడ రెండు రోజులపాటు జరిగిన సీపీఐ అన్నమయ్య జిల్లా విస్తృత సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ వందేళ్ల వార్షికోత్సవం జరుపుకుంటున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం పోరాటాలు చేస్తోందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక కుట్ర కేసులను ఎదుర్కొని ఎంతో త్యాగనిరతితో, నిస్వార్థ సేవ చేస్తోందని తెలిపారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ, మండల, గ్రామ శాఖలుగా ఏర్పాటు చేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. ప్రజల వద్దకు సీపీఐ భావజాలాన్ని తీసుకువెళ్లాలన్నారు. ఎన్నికలలో గెలవడమే కాకుండా నీతి నిజాయితీలతో నిబద్ధతతో కూడిన రాజకీయాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డిసెంబరు 26వ తేదీ నాటికి సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా పార్టీ ప్రజా సంఘాలను క్రియాశీలకంగా, పటిష్టంగా, విస్తృతంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం, జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి కోసం, నూతన పరిశ్రమల ఏర్పాటు కోసం పోరాటాలు నిర్వహించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వేత పత్రాలు విడుదల చేయడంతోనే కాలయాపన చేస్తున్నారని, రాష్ట్రంలో నెలకొన్న అశాంతిని నివారించడానికి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. నిత్యం మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, వాటిని నివారించడంలో కూడా డబుల్ ఇంజన్ సర్కార్ వైఫల్యం చెందిందని తెలిపారు. వీటన్నిటిపై పోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు మదనపల్లిలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు, దానితోపాటు పార్టీ నియోజకవర్గ, మండల శాఖ కార్యదర్శులకు, ప్రజా సంఘాల నాయకులకు ఆగస్టు 20 నుంచి 22వ తేదీ వరకు రైల్వే కోడూరు నియోజకవర్గంలో జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. మతోన్మాద శక్తులు, రౌడీ మూకల నుంచి ప్రజా ఉద్యమాలను, ప్రజలను కాపాడుకోవడానికి జనసేవా దళ్ ఏర్పాటు కోసం నవంబరులో సుండుపల్లిలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివారెడ్డి, అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు సహాయ కార్యదర్శి పి.మహేష్, కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సిద్ధిగాల్ల శ్రీనివాసులు, సాంబ, మండెం సుధీర్, మనోహర్ రెడ్డి, సుమిత్రమ్మ, మురళి విశ్వనాయక్ వెంకటేష్, జ్యోతి చిన్నయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి సరఫరాకు యుద్ధ ప్రాతిపదిక చర్యలు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతోపాటు వరద ప్రభావం పడిన గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా రక్షిత తాగునీటి సరఫరాకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి(పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి) పవన్ కల్యాణ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రక్షిత తాగు నీరు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టంచేశారు. నీటి కాలుష్యం లేకుండా చూసుకోవాలని, క్లోరినేషన్‌పై ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. సోమవారం మధ్యాహ్నం శాసనసభలోని తన కార్యాలయంలో నిర్వహించిన జనసేన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో వర్షాలు, వరదల ప్రభావంపై ఎమ్మెల్యేలతో పవన్ కల్యాణ్ చర్చించారు. వరద ప్రభావిత ప్రాంతాల శాసనసభ్యులు అక్కడి పరిస్థితులను వివరించారు. పోలవరం నియోజకవర్గం వేలేరుపాడు మండలంలోని 12 గ్రామాలు పూర్తిగా నీట మునిగి ఉన్న పరిస్థితి గురించి ఆరా తీశారు. పెదవాగు ప్రాజెక్ట్ ప్రభావంతో అక్కడి గ్రామాలు వరదబారిన పడుతున్న విషయంపై చర్చించారు. వేలేరుపాడుతోపాటు కుక్కునూరు మండలంలోని గ్రామాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో వరద ప్రభావాన్ని ఎమ్మెల్యేలు వివరించారు. వరద ప్రభావిత గ్రామాల్లో తాగునీటి సరఫరాతోపాటు అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రహదారులకు ఈ వర్షాల వల్ల ఏ మేరకు నష్టం వాటిల్లిందో నివేదిక ఇవ్వాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తక్షణమే మరమ్మతులు చేయాల్సిన రహదారులను గుర్తించాలని సూచించారు.

మన విజన్ వికసిత ఏపీ

- ఎమ్మెల్యేలూ స్థానిక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి
- ఇసుక విషయంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దు
- ఆర్థిక సంక్షోభంలో ఉన్నా సంక్షేమ పథకాలు ఆగవు
- ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వికసిత్ భారత్ విజన్-2047 తరహాలో మన విజన్ వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు. అసెంబ్లీలో సోమవారం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు చెందిన శాసనసభా పక్ష సమావేశంలో చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఎమ్మెల్యే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రణాళికతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలు మనపై ఎంతో నమ్మకం పెట్టుకుని అధికారం మన చేతిలో పెట్టారు. ఆ నమ్మకాన్ని మనం నిలబెట్టేలా పాలన అందించాలన్నారు. గత ప్రభుత్వం వ్యవస్థలను పూర్తిగా నాశనం చేసింది. ఆర్థిక శాఖ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఏ రాష్ట్రంలోనూ ఈ పరిస్థితి ఉండి ఉండదు. కనీసం అత్యవసర పనులకు కూడా నిధులు ఖర్చు చేయలేని పరిస్థితికి ఖజానాను తీసుకువెళ్లారు. మన ప్రభుత్వం ముందు అనేక సవాళ్లు, సమస్యలు ఉన్నాయి. అవన్నీ పరిష్కరించుకుంటూ సంక్షేమం, అభివృద్ధి అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నాడు ప్రజాస్వామ్యం అనేది లేకుండా పాలన చేశారు. పవన్ కళ్యాణ్ విశాఖ వెళితే అక్కడ అడ్డుకున్నారు. అక్రమంగా నన్ను జైల్లోపెట్టిన సందర్భంలో పరామర్శకు వస్తుంటే కూడా అడ్డుకున్నారు. ప్రతిపక్ష నేతగా ఎక్కడికి వెళితే అక్కడ ఆటంకాలు సృష్టించారు. నేను ఎక్కడికి వెళితే అక్కడ ఆపారు. ఐదేళ్లు జగన్ ప్రభుత్వం చేయని అరాచకం అంటూ లేదు. అయినా నాడు జగన్ చేసినట్లు మనం చేయకూడదు. వాళ్లు రాష్ట్రాన్ని దోచుకోవడానికి వచ్చారు. దోచుకున్నారు. వెళ్లిపోయారు. మనం రాష్ట్రాన్ని నిలబెట్టడానికి, ప్రజలకు మంచి చేయడానికి వచ్చాం. నాడు అత్యంత పాశవికంగా వివేకాను హత్య చేసి టీడీపీ వాళ్లపై తోసేశారు. దానిపై ఎన్ని డ్రామాలు ఆడారో మనం చూశాం. తప్పులు చేసి తప్పించుకోవడంలో వాళ్లు ఆరితేరారు. తాజాగా మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో ఫైళ్ల దగ్ధం ఘటన అందుకు ఉదాహరణ. వైసీపీ ఫేక్ ప్రచారం ఎలా చేస్తుంది అనడానికి వినుకొండ హత్య మరో ఉదాహరణ. వినుకొండలో వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యపై జగన్ ఏకంగా రాష్ట్రపతి పాలన పెట్టాలి అంటున్నాడు. మనం మాత్రం శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉంటాం. ఏ పార్టీ వాళ్లు అయినా సరే శాంతిభద్రతలు తమ చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదు. మన వైపు నుంచి ఎవరైనా చిన్న తప్పు చేసినా ఉపేక్షించేది లేదు. రాష్ట్రంలో వారసత్వంగా వచ్చిన హింసను తుదముట్టించాలి. జీరో క్రైం ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. నేను 53 రోజులు జైల్లో ఉన్నా...నా కెంత బాధ ఉండాలి. అయినా సరే కక్ష సాధింపు రాజకీయాలు వద్దు. తప్పు చేసినవారిని చట్ట ప్రకారం శిక్షిద్దాం తప్ప రాజకీయ కక్ష సాధింపులు వద్దు అని సీఎం హితవు చెప్పారు. మూడు పార్టీల ఎమ్మెల్యేలు, నేతలు ఈ విషయంలో సంయమనంతో వ్యవహరించాలని కోరారు. ప్రతి అంశంలో మూడు పార్టీల నేతలు కలిసి పనిచేయాలి. ఎవరి సెంటిమెంట్ దెబ్బతినకుండా చూడాలన్నారు. ఉచిత ఇసుక విషయంలో చిన్న విమర్శ కూడా రాకుండా చూడాలి. ఈ విషయంలో ఎవరు వేలు పెట్టినా అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. మనది ప్రజా ప్రభుత్వం...దాబు దర్పం అహంకారం వద్దు. సింపుల్‌గా ఉందాం...ప్రజలతో కలిసి పనిచేద్దామని ఉద్బోధించారు. ఎమ్మెల్యేల నుంచి ప్రభుత్వానికి మంచి సూచనలు రావాలి...క్షేత్రస్థాయి పరిస్థితులు మా దృష్టికి తీసుకురావాలి. 2029 ఎన్నికల్లో గెలవాలి అనే లక్ష్యంతో నేటి నుంచే మీరు అంతా సమర్థవంతంగా పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

ప్రజలు బుద్ధిచెప్పినా జగన్‌కు తత్వం బోధపడలేదు: పవన్

ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌కు ఇంకా తత్వం బోధపడినట్లు లేదని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. నెల రోజుల్లోనే ప్రభుత్వంపై ఆయన చేస్తున్న తీవ్ర విమర్శలు, అబద్ధాలే ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. గ్రూపు తగాదాకు రాజకీయ రంగు పులిమి అవాస్తవాలు చెప్తూ కుట్రలకు తెరలేపుతున్నారని విమర్శించారు. సభలోకి వచ్చే ముందు పోలీసులతో గొడవ, గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగలమని ఎమ్మెల్యేలను రెచ్చగొట్టడం అతని అహంకార ధోరణికి నిదర్శనమన్నారు. ఎల్లకాలం అధికారంలో కొనసాగుతామనే భ్రమ నుంచి ప్రజలు బయట పడేసినా ఇంకా తనే సీఎం అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాను, జనసేన పార్టీ నూటికి నూరు శాతం సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

అన్నింటా ప్రభుత్వ వైఫల్యం

రేపు ఢిల్లీలో ధర్నా: వైసీపీ అధినేత జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేవలం 50రోజుల్లోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్నింటా వైఫల్యం చెందిందని, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ అరాచకపాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు 'ఎక్స్'లో జగన్ పోస్ట్ చేశారు. ఈ ప్రభుత్వం 12 నెలల కాలానికి పూర్తిస్థాయి బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేకపోతోందని పేర్కొన్నారు. ఒక రాష్ట్రం...ఏడాదిలో 7 నెలలు ఓటాన్ అకౌంట్ మీదే నడుస్తోందంటే... ఎన్నికల ముందు ప్రజలను మభ్య పెడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయలేని స్థితి ఉందని స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అందుకే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే, ఆ హామీలు అమలు చేయలేమన్న గుట్టు బయట పడుతుందన్న భయం చంద్రబాబులో ఉందన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే రాష్ట్రంలో అరాచకాలను ప్రోత్సహించడం ద్వారా భయానక పరిస్థితి తీసుకొస్తున్నారని జగన్ ఆరోపించారు. హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, ఆస్తుల విధ్వంసం ద్వారా ఎవరూ ప్రశ్నించే సాహసం చేయకూడదన్న పరిస్థితిని సృష్టిస్తున్నారని తెలిపారు. వారి నిజస్వరూపం ప్రజలకు తెలుస్తుందన్న భయంతోనే..ఈ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీని, ప్రతిపక్ష నాయకుడిని గుర్తించడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 50రోజులు గడుస్తున్నప్పటికీ..చంద్రబాబు ఇన్ని భయాలతో పరిపాలన చేస్తున్నారని, అచ్చం శిశు పాలుడి పాపాల మాదిరిగా చంద్రబాబు పాపాలు కూడా పండే రోజు వేగంగా దగ్గర్లోనే ఉందన్నారు. నాతో సహా తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనాయకులు ఢిల్లీకి వెళ్తున్నామని... రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన, హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు, దోపిడీని.. ఈనెల 24వ తేదీన అక్కడ నిరసన, ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా దేశం దృష్టికి, వివిధ పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టవలిసిన అవసరాన్ని, పరిస్థితులను చెప్పబోతున్నామని తెలిపారు. తమతో కలిసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని పోరాటం కొనసాగిస్తామని జగన్ పునరుద్ఘాటించారు.

ప్రజల ఆకాంక్షలపై గవర్నర్ ప్రసంగం నీళ్లు: శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గవర్నర్ ప్రసంగం గత ప్రభుత్వ వైఫల్యాలకే పరిమితమైందేగానీ, ప్రజల ఆకాంక్షలను ఎలా నెరవేరుస్తారనే ప్రస్తావన లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీ సమకూర్చి ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజల ఆకాంక్షలపై నీళ్లు చల్లేదిగా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. విభజనతో తీవ్రంగా రాష్ట్రం నష్టపోయిందన్న గవర్నర్ ప్రసంగం ఆలోటును పూడ్చడానికి అవసరమైన ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు ప్రసక్తి లేకపోడం అన్యాయమని అన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలపైగాని, దానిని కాపాడుకునేందుకు నిర్దిష్టమైన హామీ ఏమీ లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు తమ పాలనలోనే 72శాతం పూర్తయిందని చెప్పడం మినహా, నిర్వాసితుల ప్రస్తావనే లేకపోవడం విస్మయానికి గురిచేస్తోందన్నారు. ప్రభుత్వ ఖజానా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, దీనిపై చర్చించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి బాధ్యతను తీసుకుంటానన్న ప్రధానిని కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏం హామీ ఇచ్చారో.. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న గవర్నర్ కేంద్ర సహాయం ఎలా ఉంటుందో ప్రస్తావించలేదన్నారు. ప్రజలపై భారాలు మోపకుండా కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు అన్ని పక్షాలను కలుపుకుని కేంద్రంతో పోరాడాలని కోరారు.

నితీశ్‌కు మోదీ సర్కార్ ఝలక్

బీహార్‌కు ప్రత్యేకహోదా సాధ్యం కాదని వెల్లడి

న్యూఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ కీలక మిత్రపక్షం జనతాదళ్ (యునైటెడ్) కు మోదీ సర్కారు గట్టి ఝలక్ ఇచ్చింది. బీహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే ఆలోచన కూడా లేదని కుండబద్దలు కొట్టింది. ఇటీవలే బీహార్‌లోని నితీశ్ సర్కార్... రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని తీర్మానం చేసింది. తాజాగా పార్లమెంట్‌లో జేడీయూ ఎంపీ రామ్‌ప్రీత్ మండల్ ఇదే అంశాన్ని లేవనెత్తారు. దీనికి ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి స్పందిస్తూ... బీహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే ఆలోచన లేదని తేల్చిచెప్పారు. బీహార్‌కు ప్రత్యేక హోదా కావాలన్నది జేడీయూ చిరకాల డిమాండ్. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా మెజార్టీ లభించలేదు. దీంతో బీహార్‌లోని నితీశ్ పార్టీ అయిన జేడీయూ, ఏపీలోని చంద్రబాబుకు చెందిన టీడీపీ మద్దతుతో కేంద్రంలో మోదీ 3.0 సర్కార్ ఏర్పడింది. దీంతో ఈసారైనా ఆ కల నెరవేర్చుకోవాలని జేడీయూ భావించింది. ఈ నేపథ్యంలోనే బడ్జెట్ సమావేశాల ముందు కేంద్రం ముందు ఈ ప్రతిపాదన తీసుకొచ్చింది. కానీ చివరకు నితీశ్ సర్కార్‌కు చుక్కెదురైంది. హోదా ఇచ్చే ప్రసక్తేలేదని కేంద్రం తేల్చిచెప్పడంతో ఇప్పటికే ఈ విషయమై తన ప్రధాన ప్రత్యర్థి ఆర్జేడీ నుంచి తీవ్ర విమర్శలెదుర్కొంటున్న జేడీయూ ఇరకాటంలో పడింది. సోమవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే బీహార్‌కు ప్రత్యేక హోదాపై జేడీయూ ఎంపీ రాంప్రీత్ మండల్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ ఛౌదరీ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. బీహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే ప్రతిపాదన ఏదీ లేదని వెల్లడించారు. "ప్రత్యేక కేటగిరీ హొదాను గతంలో జాతీయ అభివృద్ధి మండలి (ఎన్‌డీసీ) కొన్ని రాష్ట్రాలకు మంజూరు చేసింది. 1. కొండలు, పర్వత ప్రాంత భూభాగం 2. తక్కువ జన సాంద్రత, జనాభాలో గిరిజనుల శాతం ఎక్కువగా ఉండడం 3. అంతర్జాతీయ సరిహద్దును కలిగి ఉండడం, 4. ఆర్థిక, మౌళిక వసతుల లేమి ఉన్న రాష్ట్రం, 5. ఆర్థిక పరిస్థితి దిగజారిన రాష్ట్రాలు. ఇలా పైన పేర్కొన్న అన్ని అంశాల సమగ్ర పరిశీలన ఆధారంగా ప్రత్యేక హొదా కోసం బీహార్ చేసిన అభ్యర్థనను ఇంటర్ మినిస్టీరియల్ గ్రూప్ పరిశీలించింది. ఈ క్రమంలో తన నివేదికను 2012 మార్చి 30న సమర్పించింది. ఇప్పటికే ఉన్న జాతీయ అభివృద్ధి మండలి ప్రమాణాల ఆధారంగా బీహార్‌కు ప్రత్యేక హొదా ఇవ్వలేం" అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. ప్రత్యేక హోదా అనేది వెనుకబడిన రాష్ట్రాల అభివృద్ధికి దోహదపడుతుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.